

దూసుకొచ్చిన మృత్యువు!





రోడ్డు ప్రమాదానికి గురైన కారు.. కారు ఢీకొని విరిగిపడిన తొట్టిరిక్షా

- అతివేగంతో వస్తూ టైరు పేలి బీభత్సం సృష్టించిన పెళ్లికారు
- కిర్లంపూడి మండలం సోమవరం బస్టాప్ వద్ద స్థానికులపైకి దూసుకెళ్లిన వైనం
- రెప్పపాటులో ముగ్గురు బలి.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- తొట్టిరిక్షా తోస్తుండగా తాత, మనవడి మృతి
- బొప్పాయిలు అమ్ముకునేందుకు వచ్చి మరొకరు
- జీజీహెచ్‌లో ఇద్దరి పరిస్థితి విషమం

7



కాకినాడ జీజీహెచ్‌లో క్షతగాత్రుల పరిస్థితి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నెహ్రూ



దారి.. చూపారు!

జలదారులివే..

కాకినాడ నుంచి రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం-విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి భద్రాచలం, అంతర్వేది నుంచి నరసాపురం, నరసాపురం నుంచి సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం, నిడదవోలు నుంచి ఏలూరు వరకు జలరవాణా రూట్లను గుర్తించారు. ఈ మార్గాల్లో పలు పరిశ్రమలకు కార్గో రవాణాతోపాటు పర్యాటక బోట్లను నడిపేందుకు అనుమతులిస్తూ ఆసక్తి కలిగిన సంస్థలను ఆహ్వానించారు. కాకినాడ నుంచి విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి భద్రాచలంతో పాటు పలు ఇతర మార్గాల్లోను భారీ రివర్ క్రూయిజ్‌లను నడపవచ్చని ప్రతిపాదించారు. ఇటీవల ఎంపిక చేసిన జల రవాణా మార్గాల్లో వ్యాపారాలు చేయడానికి కొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి. బకింగ్‌హం కాలువ అభివృద్ధి పనులు పట్టాలెక్కిన తర్వాత వీటితో చర్చలు జరిపి సరకు, పర్యాటక రవాణాకు సంబంధించి పూర్తిస్థాయి కార్యాచరణ చేపట్టనున్నారు.

జల రవాణాకు మార్గం సుగమం

- కాకినాడ టూ పుదుచ్చేరి
- బకింగ్‌హం కెనాల్‌కు మంచిరోజులు
- పురాతన జలరవాణాకు పచ్చజెండా
- ఐడబ్ల్యూఏఐతో సర్కారు ఒప్పందం
- రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధి
- ఐదేళ్లపాటు ఎంవోయూ అమలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ-పుదుచ్చేరి బకింగ్‌హం కాలువకు ఎట్టకేలకు మంచి రోజులొచ్చాయి. ఈ మార్గంలో గోదావరి,కృష్ణా నదుల మీదుగా సరుకు రవాణా, పర్యాటక అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మళ్లీ ఈ కాలువకు పూర్వ వైభవం తెచ్చే దిశగా రంగం సిద్ధమవుతోంది. ఈమేరకు కాలువ అభివృద్ధికి ఇన్నేళ్లకు ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో ఎంవోయూ కుదిరింది. ఐదేళ్ల పాటు అమల్లో ఉండనున్న ఒప్పందం మేరకు ఈ రెండూ కలిసి బకింగ్‌హం కెనాల్ అభివృద్ధి, జల రవాణా మార్గాల అన్వేషణ, కాలువల డ్రెడ్జింగ్, రివర్ క్రూయిజ్ పర్యాటకాన్ని ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నాయి. తొలుత రూ.80 కోట్లతో కాలువ అభివృద్ధికి ఐడబ్ల్యూఏఐ శ్రీకారం చుట్టనుంది.

ఒప్పందాలు ఇలా..

జల రవాణాకు డిమాండ్ పెరగడం, కారుచౌక రవాణామార్గం కావడంతో కాలువను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కాలువను అభివృద్ధి చేసే ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) తోను చర్చలు జరిపారు.ఈ మేరకు వారం కిందట ముంబైలో జరిగిన మారిటైం సదస్సులో కాలువను రూ.80కోట్లతో అభివృద్ధి చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పందం ఐదేళ్లపాటు అమల్లో ఉంటుంది. నౌకల రాకపోకలకు వీలుగా కాలువల్లో పూడిక తీయడం, ఓడలు రాకపోకలు సాగించేలా వెస్సల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటు, నావిగేషన్ వ్యవస్థ తీర్చిదిద్దడం, కాలువల్లో రివర్ క్రూయిజ్‌లు నడిపేలా సహాయ పడడం వంటివన్నీ మౌలిక సదుపాయాల రూపంలో తీర్చిదిద్దనుంది. సెకండ్ పార్టీ కింద రాష్ట్ర ప్రభుత్వం తరపున జల రవాణా మార్గాన్ని అభివృద్ధి చేసిన తర్వాత రివర్ క్రూయిజ్ నౌకలు బెర్తింగ్ అవడానికి కావాల్సిన భూముల కేటాయింపు, బకింగ్‌హం కాలువలో డ్రెడ్జింగ్ తర్వాత తవ్వితీసిన భారీ బురద, మట్టిని నిల్వ చేసేందుకు తగిన స్థలాలు, సరుకు రవాణా, పర్యాటక నౌకల రాక పోకలు, వెస్సల్ ట్రాఫిక్ పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంది. ఐదేళ్లపాటు ఇవన్నీ ఈ రెండు ఒప్పందం ప్రకారం చేయాలని ఎంవోయూలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఇన్నేళ్ల తర్వాత బకింగ్‌హం కెనాల్ అభివృద్ధికి మార్గం సుగమం కానుంది.

నాడు ఎంతో ప్రసిద్ధి

కాకినాడ-పుదుచ్చేరి బకింగ్‌హం కాలువ బ్రిటిష్ కాలంలో ఎంతో ప్రఖ్యాతి చెందింది. కాకినాడ నుంచి మొదలయ్యే ఈ కాలువ గోదావరి, కృష్ణా మీదుగా తమిళనాడులోని విల్లుపురం వరకు 796 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మన రాష్ట్ర పరిధిలో 257 కి.మీ. వరకు ఉంది. కాకినాడ నుంచి గోదావరి మీదుగా తమిళనాడు వరకు అప్పట్లో జల రవాణా కింద సరుకులు భారీగా ఎగుమతి, దిగుమతి అయ్యేవి. అయితే క్రమేపీ కాలువ పూర్తిగా పూడుకుపోవడంతో ప్రభుత్వాలు గాలికొదిలేశాయి.

ఎన్ని అవకాశాలో..

బకింగ్‌హం కాలువ ద్వారా సరుకు రవాణాకు మళ్లీ ఊపిరిలూదాలని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భావించింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ప్రతిపాదనలన్నీ మూలనపడిపోయాయి. మళ్లీ ఇప్పుడు సీఎం చంద్రబాబు బకింగ్‌హం కాలువ అభివృద్ధికి ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చేలా ఒప్పించారు. ఒప్పందానికి ముందే ప్రభుత్వం తరపున పది జల రవాణా మార్గాలను ఎంపిక చేసి అభివృద్ధి చేసేలా ప్రైవేటు సంస్థలను టెండర్ల ద్వారా ఆహ్వానించింది.ఈ మార్గాల్లో డ్రెడ్జింగ్ అనంతరం రవాణా కార్యకలాపాలు ప్రైవేటు సంస్థలు సాగించేలా నిబంధనలు రూపొందించారు.



కార్మిక.. నీ కోసమిక!

కార్మికుల సంక్షేమాన్ని గత వైసీపీ ప్రభుత్వం తుంగలోకి తొక్కింది. కార్మికుల పొట్టకొట్టేలా సంక్షేమ పథకాల అమలును అటకెక్కించింది. భవన నిర్మాణ, అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. వారికి అమలు చేయాల్సిన పథకాలన్నింటినీ ఆచరణలో పెట్టేలా చర్యలు చేపడుతోంది.

- నాడు సంక్షామం.. నేడు సంక్షేమం
- కార్మికులను విస్మరించిన వైసీపీ
- పథకాల నిధులు దారి మళ్లింపు
- నాలుగేళ్ల పాటు మొండి చేయి..
- కార్మికులకు అండగా కూటమి
- సంక్షేమానికి పెద్ద పీట

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

అసంఘటిత, భవన నిర్మాణ కార్మికులు లక్షల్లో ఉంటారు. వీరి సంక్షేమానికి అప్పట్లో టీడీపీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2020 సెప్టెంబరు 7వ తేదీ నుంచి పలు సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేసింది. భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు, అందులో ఉన్న కోట్లాది రూపాయల నిధులను ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించింది. 1214 మెమో విడుదల చేసి కార్మికులకు రావాల్సిన పథకాలు అమలు ఆపేసింది. కార్మికులను అంధకారంలోకి నెట్టింది. వైద్య సాయం కింద రూ.20 వేల వరకు గత టీడీపీ ప్రభుత్వం క్యాన్సర్, కిడ్నీ, బ్రెయిన్‌ట్యూమర్, గుండెజబ్బు, పక్షవాతం, ఎయిడ్స్, గర్భసంచి చికిత్స, ట్రామాకేర్ కింద చికిత్సపొందుతున్న కార్మికులకు అందించేవారు.ఈ పథకానికి మొండిచేయి చూపింది.ప్రమాద మరణ ఆర్థిక సాయం కింద రూ.30 వేలు, సహజ మరణం ఆర్థిక సాయం కింద రూ.10 వేలు అందజేసే వారు వాటిని విస్మరించింది. ప్రమాద కారణంగా అంగవైకల్యం సంభవిస్తే రూ.20 వేల వరకు ఆర్థికసాయం, అంగవైకల్యం 25 నుంచి 40 శాతం ఉంటే రూ.10 వేలు, అంగవైకల్యం 41-49 శాతం ఉంటే రూ.15 వేలు, 50 శాతం ఆ పైన ఉంటే రూ.20 వేలు చెల్లించేవారు. ఇదీ కూడా లేకుండా చేసింది. అంత్యక్రియలకు ఆర్థికసాయం రూ.ఐదు వేలు, వివాహ కానుక రూ.10 వేలు, ప్రసూతి సహాయం రూ.ఐదు వేలు, ఆదర్శ కుటుంబ ప్రోత్సాహకం కింద కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారికి రూ.2 వేలు, విద్యా ప్రోత్సాహం కింద ప్రతి సంవత్సరం స్కాలర్ షిప్‌లు మంజూరు, ఉపకార వేతనం ఇలా కార్మికుల సంక్షేమానికి ఎన్నో పథకాలను 2019 ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తే.. వీటన్నింటినీ వైసీపీ సర్కారు అటకెక్కించింది.

పథకాలకు మళ్లీ ఊపిరి..

కార్మికుల జీవితాల్లో వెలుగునింపే కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. అసంఘటిత రంగంలోని కార్మికులను ఆదుకునే ఉద్దేశంతో ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం అమలు చేసేది. పని ప్రదేశంలో ప్రమాదం జరిగి కార్మికుడు చనిపోతే చంద్రన్న బీమా కింద ఆ కార్మికుడి కుటుంబానికి రూ.ఐదు లక్షలు అందజేస్తారు. తక్షణ సాయం కింద రూ.20 వేలు ఇస్తారు. ప్రమాదంలో అంగవైకల్యానికి గురైతే రూ.లక్ష నుంచి రూ.25 వేల వరకూ అందిస్తారు. అలాగే పని ప్రదేశంలో సాధారణ మరణం పొందినా కూడా చంద్రన్న బీమా కింద రూ.60 వేలు అందిస్తారు. మహిళా కార్మికులకు ప్రసవ సమయంలో రూ.10 వేలు అందిస్తారు. రెండు కాన్పుల వరకూ ఈ నగదు ఇస్తారు. అయితే 18-59 ఏళ్ల మధ్య వయసు వారు అర్హులు. నమోదు చేసుకునే ఏడాదికి.. 90 రోజుల పాటు నిర్మాణరంగంలో పనిచేసిన అనుభవం ఉండాలి. కార్మికశాఖ అధికారులకు రూ.110 చెల్లించి గుర్తింపు కార్డు పొందవచ్చు. నమోదు చేసుకున్నాక ఐదేళ్లకు రూ.60 చెల్లించి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు చేసుకున్న మూడు రోజుల్లోపే కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. త్వరలోనే ఈ పథకం తిరిగి కార్మికులకు చేరువకానుంది.

వీరంతా అసంఘటిత కార్మికులే..

అసంఘటిత రంగంలో ఉన్న భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలనే ముఖ్యోద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమమండలిని ఏర్పాటు చేసింది. ఈ సంక్షేమ మండలిలో రాళ్లు పగులకొట్టు పనివారు, తాపీ, ఇటుక పనివారు, వడ్రంగి, పెయింటర్లు, రాడ్ బెండింగ్, సెంట్రింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, మెకానిక్, పూడిక తీత, బావులను తవ్వేవారు, వెల్డర్స్, బంటా మేస్త్రీ, మేస్త్రీ, రోడ్లు, డ్రైనేజీలపై మందు పిచికారీ, కలప, చిప్స్ ప్యాకింగ్ చేయువారు, ఇల్లు నేసేవారు, సమ్మెట పనివారు, కాంక్రీట్ మిక్సింగ్, మిక్సర్ డ్రైవర్, పంపు ఆపరేటర్, రోలర్ డ్రైవర్, కళాసీ, వాచ్‌మెన్, రోడ్డు నిర్మాణకార్మికులు, సున్నం పనివారు ఇలా అనేక మంది సంక్షేమానికి సంబంధించి, ఇక్కడ పథకాలు అమలు చేయాల్సి ఉంది.



ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

'ఏలేరు'లో తగ్గుతున్న నీటి నిల్వలు

ఏలేశ్వరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏలేరులో జలాశయంలో నీటి నిల్వలు తుఫాన్ తర్వాత తగ్గుముఖం పట్టాయి. శనివారం ఎగువ ప్రాంతం నుంచి 756 క్యూసెక్కుల నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. ప్రాజెక్టులో 86.56మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 85.53 మీటర్ల స్థాయిలో 22.12 టీఎంసీలు నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ప్రాంతానికి 1200 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 175 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.

కొట్టుకుపోయిన సత్యవరపుపేట కాజ్‌వే



వీకేరాయపురంలో ఏలేరు వరద ఉధృతికి కొట్టుకుపోయిన సత్యవరపుపేట వెళ్లే కాజ్‌వే

- వ్యవసాయోత్పత్తుల రవాణాకు రైతుల ఇక్కట్లు
- శాశ్వత ప్రాతిపదికన కాజ్‌వే నిర్మించాలని వినతి

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వీకే రాయపురం నుంచి ఏలేరు కాలువ మీదుగా సత్యవరపుపేట వెళ్లేందుకు నిర్మించిన కాజ్‌వే ఏలేరు వరద ప్రవాహానికి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో కాలువ అవతల ఉన్న పొలాలనుంచి రైతులు వ్యవసాయోత్పత్తులను తెచ్చుకునేందుకు వీలు లేకుండా పోయిందని వీకే రాయపురం, బోయినపూడి గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో పలు దఫాలు ఈ కాజ్‌వే వరద ప్రవాహానికి కొట్టుకుపోగా రైతులు తమ సొంత నిధులు వెచ్చించి కాజ్‌వేకు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకున్నారు. ఇందుకు రైతులు సొంత సొమ్ములు వెచ్చించాల్సి వచ్చింది. శాశ్వత ప్రాతిపదికన కాజ్‌వే ఏలేరు కాలువపై నిర్మించి రైతులను ఆదుకోవాలని పదేళ్లుగా జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కాలువ అవతల 4వేల ఎకరాల వరిపొలాలు ఉండడంతో ప్రస్తుతం పంట పక్వదశకు చేరుకునే సమయం ఆసన్నమైందని, మరో పదిరోజుల్లో పంట కోతలు ప్రారంభమైతే కాజ్‌వే కూలిపోవడంతో ధాన్యాన్ని ఎలా తెచ్చుకోవాలని రైతులు కలవరం చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.25వేలకుపైబడి పంట పెట్టుబడులు పెట్టామని, చేతికి అందిన పంటను తెచ్చుకునే వీలు లేకపోవడంతో తమ సమస్యను తక్షణం అధికారులు స్పందించి కాజ్‌వే స్థానంలో శాశ్వత ప్రాతిపదికన వ్యవసాయోత్పత్తులను తెచ్చుకునేందుకు రవాణామార్గాలను ఏర్పాటు చేయాలని సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణ స్వామి(రాజు) కోరుతున్నారు. ఈ మేరకు తమ సమస్యలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు శనివారం రాత్రి వివరించారు.

ఘనంగా భక్త కనకదాసు జయంతి వేడుకలు



పూలమాలలు వేసి అంజలి ఘటించిన కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తత్వవేత్తగా, కవిగా, సంగీతకారుడిగా, సంఘ సంస్కర్తగా, కర్ణాటక సంగీత విద్వాంసుడిగా భక్త కనకదాసు విశేషమైన సేవలందించారని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. సాధు భక్త కనకదాసు జయంతిని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత భక్త కనకదాసు చిత్రపటానికి కలెక్టర్ షాన్‌మోహన్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకదాసు కర్ణాటకలో హావేరి జిల్లా, బాదా గ్రామంలో ఒక కురుబ గౌడ కుటుంబంలో తిమ్మప్ప నాయకుడికి జన్మించారన్నారు. సామాజిక సంఘ సంస్కర్తగా కనకదాసు తన సాహిత్యం ద్వారా సామాజిక సమానత్వాన్ని ప్రబోధిస్తూ అంటరానితనం వంటి దురాచారాల నిర్మూలనకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన ప్రసిద్ధ హరిదాసు సాధువుగా, తత్వవేత్తగా, సంగీతకారుడిగా విశేషమైన సేవలందించారన్నారు. భక్త కనకదాసు జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి లల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌ఎంసీ ఫ్రెషర్స్ డే వేడుకలు

- పాల్గొన్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

జీజీహెచ్(కాకినాడ) నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో 68వ ఫ్రెషర్స్‌డే అరోహ-2025పేరుతో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్ హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా మాజీ డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్థన్, అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ నేటి తరంలో విద్యార్థులకు చదువుకునే అవకాశాలు మరిన్ని పెరిగాయన్నారు. రంగరాయ వైద్యకళాశాల విశిష్టమైన వైద్య విద్యా కేంద్రమని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆర్ఎంసీలో చదివిన విద్యార్థులు ఉన్నత విద్యావంతులై దేశ,విదేశాల్లో స్థిరపడి నగరంతో పాటు దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారన్నారు. విద్య పూర్తయిన తర్వాత ఎవరు ఏస్థాయిలో ఉన్నా చదువుకున్న విద్యాలయం అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం డాక్టర్ నరసింహం, డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ రంగరాయ వైద్యకళాశాల దినదినాభివృద్ధి చెందిందన్నారు. పూర్వపు విద్యార్థులు కళాశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆర్ఎంసీ క్రమశిక్షణకు మారుపేరని ఈ క్రమశిక్షణే కళాశాలను దేశస్థాయిలో గుర్తింపు పొందిన విద్యాసంస్థగా తీర్చిదిద్దిందన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణను అలవర్చుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. అనంతరం వైద్యవిద్యార్థులు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో 220మంది ఫ్రెషర్స్‌తోపాటు ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ కె.శైలజ, డాక్టర్ ముఖర్జీ, డాక్టర్ వంశీప్రియ, డాక్టర్ సుధాకర్‌బాబు, డాక్టర్ లలిత, వార్డెన్ డాక్టర్ వీరయ్య, డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్న వైద్య విద్యార్థులు



మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

'వాడపల్లి'కి.. ఉచిత బస్సుకై..!



వాడపల్లి వెళ్లి వచ్చే భక్తులతో రద్దీగా ఉన్న రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్

- రావులపాలెం ఆర్టీసీ బస్టాండ్‌కు భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు
- ఉదయం నుంచి బస్సు కోసం ప్రయత్నం
- రాత్రి వరకు రద్దీగానే ఆర్టీసీ కాంప్లెక్స్

రావులపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి వచ్చే భక్తులతో రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రద్దీ నెలకొంది. పైగా, మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం కూడా ఉండడంతో వారంతా బస్సులకోసం వేచిచూడాల్సి వచ్చింది. కార్తీకమాస పర్వదినాల్లో భాగంగా శనివారం పెద్ద ఎత్తున భక్తులు వాడపల్లి వెళ్లేందుకు ఇక్కడకు తరలివచ్చారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడింది. ఉదయంనుంచి రాత్రి వరకూ రద్దీ ఏర్పడింది.

వీడనున్న మిస్టరీ!

- రామచంద్రపురం బాలిక మృతి కేసులో చివరిదశకు దర్యాప్తు
- ప్రాథమిక ఆధారాల ప్రకారం అనుమానాస్పద మృతిగానే కేసు నమోదు
- ఇప్పటికే పలువురిని ప్రశ్నించిన పోలీసు అధికారులు
- విచారణను స్వయంగా పర్యవేక్షిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా
- వరుసగా రెండురోజులు పోలీస్‌స్టేషన్‌కు రాక.. కేసు పురోగతిపై ఆరా
- నేడు కేసు వివరాలు వెల్లడించే అవకాశం

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బాలిక మృతి మిస్టరీ వీడనుందా.. అంతుచిక్కని వ్యవహారంగా మారిన ఈ కేసు దర్యాప్తు ముగింపు దశకు చేరినట్లు సమాచారం. ఈ కేసు విచారణను ఎస్పీ రాహుల్‌మీనా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీని నిమిత్తం ఇప్పటికే ఆయన రెండుసార్లు రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌కు కూడా వచ్చారు. కేసు పురోగతిపై స్వయంగా ఆయనే ఆరా తీస్తున్నారు. దర్యాప్తు చివరి దశకు రావడంతో ఆదివారం వివరాలు వెల్లడించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఏం జరిగిందంటే..

ఈనెల 4న రామచంద్రపురంలో 5వతరగతి విద్యార్థిని సిర్రా రంజిత(10) అనే బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో మరణించింది. బాలిక తల్లి సునీత స్థానిక ఏరియా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తున్నారు. పట్టణంలోనే త్యాగరాజునగర్‌లోని అద్దెఇంట్లో నివసిస్తున్నారు. సునీత భర్త సిర్రా రాజు ముంబయిలో షిప్‌యార్డులో పనిచేస్తున్నారు. వీరి పెద్దకుమార్తె నవోదయ పాఠశాలలో చదువుతోంది. చిన్నకుమార్తె రంజిత స్థానిక ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఈనెల 4న సునీత కాకినాడ వెళ్లి తిరిగి వచ్చేసరికి బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న స్థితిలో మరణించింది. స్థానికుల సహకారంతో రామచంద్రపురం ఏరియా ఆసుత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రుల అనుమానాలు

బాలిక మృతిపై తల్లి సునీత, తండ్రి రాజు అనుమానాలు వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన రోజున ఏరియాఆస్పత్రి వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో వారు పలు అంశాలు ప్రస్తావించారు.ముఖ్యంగా ఉరివేసుకునే ఫ్యాన్ రంజితకు అందని స్థితిలో ఉండడం, సమీపంలో ఎత్తుకు ఎటువంటి పరికరాలూ వాడిన దాఖలాలు లేకపోవడం, ఫ్యానుకు ఉరివేసుకున్న చున్నీకి వేసిన ముడులు క్లిష్టంగా ఉండడం వంటి పలు అంశాలను ప్రస్తావించారు. వీరి ఆరోపణల ఆధారంగా ఇంటి యాజమాని కుమారుడిని పోలీసులు విచారించినట్లు తెలుస్తోంది. సీసీ పుటేజీల ఆధారంగా మరికొంత మందిని కూడా విచారించినట్లు చెప్తున్నారు. ఎలక్ట్రికల్ పనులు చేసే ఓ యువకుడిని కూడా విచారించినట్లు తెలుస్తోంది.

హత్యా. .ఆత్మహత్యా..

కాగా బాలిక మృతిపై అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో అనుమానాస్పద మృతిగానే పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు రంజిత మృతిపై ప్రాథమిక ఆధారాలతో ఒక అభిప్రాయా నికి వచ్చినట్లు సమాచారం. హత్య కేసుగానే దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ఇప్పటికే ఐదు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. కీలక ఆధారాల సేకరణలో యంత్రాంగం ముమ్మరంగా కృషి చేస్తోంది.

కీలకంగా మారనున్న పోస్టుమార్టం

బాలిక మృతదేహానికి ఈనెల 5న పోస్టుమార్టం నిర్వహించారు. మృతికిగల కారణాలు సాంకేతికంగా తెలుసుకునేందుకుగాను ఫోరెన్సిక్ పరీక్షలకు శాంపిల్స్ పంపినట్లు పోలీసులు తెలిపారు. కేసుదర్యాప్తులో సాంకేతిక ఆధారాలు కీలకం కానున్నట్లు తెలుస్తోంది.

వరుసగా రెండురోజులు ఎస్పీ రాక

కాగా, ఈ కేసును జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసు అధికారులను కేసు విచారణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలిక మృతి కావడంతో తాను స్వయంగా వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. శనివారం రాత్రి కూడా ఎస్పీ రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. డీఎస్పీ రఘువీర్ కూడా రామచంద్రపురం స్టేషన్‌లో ఉన్నారు. కేసు మిస్టరీని దాదాపు ఛేదించినట్లు తెలుస్తోంది. ఆదివారం కేసు వివరాలు వెల్లడించే అవకాశం ఉందని సమాచారం.

ఎనిమిదేళ్ల తర్వాత మహిళకు పెద్ద ఖర్మ

- చింతూరు మండలం కల్లేరులో కార్యక్రమం నిర్వహించిన ఐద్వా గ్రామ కమిటీ



జోగమ్మకు సంప్రదాయ పెద్ద ఖర్మను నిర్వహిస్తున్న గ్రామస్థులు

చింతూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆ మహిళ కాలం చేసి ఎనిమిదేళ్లయింది. కొడుకులు పట్టించుకోలేదు. దీంతో ఐద్వా నేతృత్వంలో ఆదివాసీ సంప్రదాయ పద్ధతిన పెద్ద ఖర్మ కార్యక్రమం శనివారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కల్లేరులో శనివారం చోటుచేసుకుంది. 15ఏళ్ల క్రితం సరిహద్దు రాష్ట్రమైన ఒడిస్సాలోని వినాయకపురం నుంచి పండుగ జోగమ్మ కల్లేరు వలస వచ్చింది. ఆమెకు ఇద్దరు కుమారులున్నారు. ఎనిమిదేళ్ల క్రితం జోగమ్మ మృతి చెందింది. గ్రామస్థులు ఆమెకు దహన సంస్కారాలు తమ సంప్రదాయ పద్ధతిలో చేసేశారు. పెద్ద ఖర్మ చేయడానికి ఆమె వారసత్వం తప్పని సరి. దీనిపై ఆమె కుమారులకు సమాచారం ఇచ్చినా ఫలితం లేదు. తమ గ్రామంలో ఒక మహిళకు చివరకు పెద్ద ఖర్మ నిర్వహించకపోలేకపోవడాన్ని గ్రామస్థుల మనస్సు కలచివేసేది. కల్లేరు ఐద్వా గ్రామ కమిటీ పెద్ద ఖర్మ చేసేందుకు ముందుకు వచ్చింది. పెద్దల అనుమతితో కొంతసొమ్ము చందాగా ఇచ్చింది. తదుపరి గ్రామంలోని ప్రతిఇంటికి రూ.200 వంతున, 2కిలోల బియ్యం చందా రూపంలో జమ చేసింది. జోగమ్మ నివసించిన స్థలంలో చిన్న ఇల్లును కూడా ఏర్పాటు చేశారు. జోగమ్మ కుమారులకు సమాచారం ఇవ్వడంతో వారు చుట్టపుచూపుగా కార్యక్రమానికి వచ్చారు. ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్షురాలు శ్రీదేవి, సభ్యులు ముర్రం రంగమ్మ, చిన్నమ్మ, సోయం రమాదేవి కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

సామర్లకోటలో భీమేశ్వరుడికి ఆకాశదీప పూజలు

సామర్లకోట,నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో కార్తీకమాస మహాపర్వదినాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఆలయ ధ్వజస్తంభంవద్ద పండితులు ఆకాశదీప పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో దీపారాధన సంఘం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన పూజలు చేశారు.



సామర్లకోట భీమేశ్వరాలయంలో ఆకాశదీప పూజలు, జ్యోతిర్లింగార్చన పూజలు చేస్తున్న దృశ్యం

బండెనక బండి కట్టి..!



బండెనక బండి కట్టి.. 16 బళ్లు కట్టి అన్నట్టుగా వరుసగా వెళ్తున్న ఈ ఎడ్ల బండ్లు పిఠాపురం జాతీయ రహదారిపై శనివారం కనిపించాయి. ధాన్యం తోలకాలకు ఒకదాని వెనుక ఒకటి ఇలా వెళ్తూ 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.

ఫొటో: ఆంధ్రజ్యోతి-కాకినాడ స్టాఫ్‌గ్రాఫర్

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- 14, 15వ తేదీల్లో విశాఖలో భాగస్వామ్య సదస్సు-2025
- పారిశ్రామికసంస్థలు, పారిశ్రామికవేత్తలు హాజరుకావాలి



ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన భాగస్వామ్య సదస్సు బేనర్

సర్పవరంజంక్షన్, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): విశాఖపట్నంలో ఈనెల 14-15వ తేదీల్లో రెండురోజులపాటు భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 30వ భాగస్వామ్య సదస్సు-2025లో ఉమ్మడి జిల్లాల నుంచి అధికసంఖ్యలో పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈ యూనిట్ల నిర్వాహకులు తరలివెళ్లేలా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి కృషిచేస్తున్నారు. పారిశ్రామిక సదస్సు జరుగనున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న పారిశ్రామిక ప్రాంతాలు, పరిశ్రమల్లో మౌలిక సదుపాయాలకల్పన, స్థానిక పరిశ్రమల నిర్వాహకులతో కలసి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనాసంస్థ (ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో మెరుగైన మౌళిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, కాలుష్య నిర్మూలన కోసం విస్తృతంగా మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. ఈమేరకు ఈనెల 10న ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కాకినాడరూరల్ మండలం వాకలపూడి పారిశ్రామిక ప్రాంతంలో రూ.1.79కోట్ల ఐఏఎల్ఏ వాకలపూడి నిధులతో రోడ్లు, మౌళికసదుపాయాల కల్పన, మరమ్మతులు, వీధిదీపా లు, ఎస్‌వీ దీపాలు, ఫీడర్‌పిల్లర్ తదితర నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేసేందుకు ఏపీఐఐసీ ఏర్పాట్లు చేస్తోంది. ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో కాలుష్య నిర్మూలన కోసం గ్రీన్‌బెల్ట్ పచ్చదనంకోసం విస్తృతంగా మొక్కలు నాటించేందుకు చర్యలు తీసుకున్నారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సుకి తరలిరావాలి

ఏపీఐఐసీ కాకినాడజోన్‌పరిధిలో గల పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈ యాజమా న్యాలు, ఎంఎస్ఎంఈ క్లస్టర్ బృందాలు, జోన్ పరిధిలో ఉన్న 11పారిశ్రామిక ప్రాంత ప్రాధికార సంస్థలు (ఐఏఎల్ఏ)లో సొసైటీ సభ్యులు తరలి రావాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి కోరారు. ఈనెల 14-15వ తేదీల్లో విశాఖ ఏయూలో జరిగే సదస్సులో పాల్గొనే వారు http:\\partnershhipsummit.ap.gov.in ఆన్‌లైన్ లింక్‌లో తమ పేర్లు నమోదు చేసు కోవాలని కోరారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఏపీ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భాగస్వామ్యసదస్సు ప్రధాన ఉద్దేశం పరిశ్రమల అభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, పెట్టుబడుల ఆకర్షణ, ఆర్థికవృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను పెంచేందుకు , భవిష్యత్తు వ్యూహాలను ఈ భాగస్వామ్య సదస్సు ద్వారా నిర్ణయించడం జరుగుతు ందన్నారు. ఉమ్మడిజిల్లా నుంచి అధికసంఖ్యలో పారిశ్రామిక సంస్థలు, ఔత్సాహిక పారిశ్రా మికవేత్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు.

వైసీపీ పాలనలో పీఏసీఎస్, డీసీసీబీ వ్యవస్థలు నిర్వీర్యం

- పీఏసీఎస్, డీసీసీబీలను బలోపేతం చేస్తాం
- మంత్రి అచ్చెన్నాయుడు



కూర్మాపురంలో శతాబ్ది భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

రాయవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో పీఏసీఎస్‌లు, డీసీసీబీ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కూర్మాపురం సహకార సంఘం ఏర్పడి 105 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సహకార సంఘం శతాబ్ది భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి(కూర్మాపురం అబ్బు) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దురదృష్టవశాత్తూ రాష్ట్రంలో చాలా సహకార సంఘాలు వెనుకబడి, డీసీసీబీలు అప్పుల్లో ఉండటానికి కారణం ఐదు సంవత్సరాలు ఎన్నికలు నిర్వహించకుండా నామినేట్‌చేసి నచ్చిన వారికి నచ్చినట్లు పరపతి సం ఘాలు, డీసీసీబీలను అప్పజెప్పి పూర్తిగా అవినీతిమయం చేసి వేల కో ట్ల రూపాయలను ఐదు సంవత్సరాలపాటు దోచుకుని వ్యవస్థను చిన్నాభిన్నం చేశారన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత చాలామంది ఎమ్మెల్యేలు తన దగ్గరకు వచ్చి గత ప్రభుత్వ పాలనలో తమ నియోజకవర్గాల్లో పీఏసీఎస్‌లు, డీసీసీబీల్లో దారుణాలు జరిగాయని ప్రజల సొమ్ము అప్పనంగా దోచేశారని చెప్పారన్నారు. దీనిపై అసెం బ్లీలో ఒకరోజు అంతా చర్చ జరిగిందని, ప్రతి సంఘం మీద ఎంక్వయిరీ చేయడం ఒక ఎత్తు అయితే డీసీసీబీల పరపతి సంఘాల మీద ఒక శాసనసభా కమిటీ వేసినట్లు గుర్తుచేశారు. ఈదేశంలో సొసైటీలు, డీసీసీబీలు కంప్యూటరైజ్డ్ చేయాలని లోన్లు ఎంతమంది తీసు కున్నారు, ఎంత కడుతున్నారు తెలుసుకునేందుకు వీలుగా ప్రధాని మోదీ సహకార సంఘాలు, డీసీసీబీలు కంప్యూటరైజ్డ్ చేయాలని నిర్ణయించారన్నారు. అనేక ఒత్తిడిలు వచ్చినప్పటికీ ఆంధ్ర రాష్ట్రంలో పీఏసీఎస్‌లు, డీసీసీబీలు నూటికి నూరుశాతం తాము తమ ప్రభుత్వం కంప్యూటరైజ్డ్ చేశామన్నారు. డీసీసీబీలు, పీఏసీఎస్‌లను కూటమి ప్రభుత్వం బలోపేతం చేయడంతోపాటు పీఏసీఎలకు ధాన్యం కొనుగోలు, ఎరువులు, విత్తనాలు అమ్మకాలు సాగించడం ద్వారా బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. తుఫాను తరువాత పంటలన్నీ నేలవాలాయని, పంట చేతికి వచ్చే సమయంలో రైతుకు చాలా నష్టం జరిగిందని, రైతు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. రైతులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగాన్ని రైతుల దగ్గరకు పంపించి వాస్తవాలను నమోదు చేయాలని సూచించామన్నారు. అగ్రికల్చర్, వరి పంటనష్టంపై ఈనెల 7న వచ్చిన రిపోర్టుపై ఒక అంచనాకు వచ్చామన్నారు. పంట నష్టం వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుకు 17వేలు సరిపోదని ఇటీవల విజయవాడ వరదలు వచ్చిన సమంలో ఒక జీవో ఇచ్చి వరి పంట నష్టపోతే హెక్టార్‌కు 17వేల రూపాయల నుంచి 25వేలకు పెంచామని, అరటికి 35వేలకు పెంచి రైతుకు నష్టం లేకుండా పరిహారం అందజేస్తామన్నారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడిని మాజీ ఎమ్మెల్సీ చౌదరి, ఆయన సతీమణి సహకార సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ వట్టికూటి సూర్యకుమారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, డీసీసీబీ చైర్మన్ రామస్వామి, డీసీఎంఎస్ చైర్మన్ చంద్రమౌళి సర్పంచ్ చౌటపల్లి చక్రవేణి, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, సహకారసంఘం అధ్యక్షురాలు సూర్యకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అసోంకు సామర్లకోట నుంచి బియ్యం ఎగుమతులు

- రైల్వేకు రూ.70 లక్షల ఆదాయం

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట రైల్వేగూడ్స్ యార్డు నుంచి 2,400 మెట్రిక్ టన్నుల పరిమాణం గల పచ్చిబియ్యం ఎగుమతులను శనివారం తెల్లవారుజాము వరకూ ప్రత్యేక గూడ్స్‌రైలు ద్వారా ఎగుమతులు చేశారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని రెండు ప్రముఖ రైస్‌మిల్లులకు చెందిన ఈ బియ్యం ఎగుమతులకోసం 42 వ్యాగన్లు వినియోగించారు. సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డు నుంచి అసోంకు ఎగుమతులు చేస్తున్న పచ్చిబియ్యం రవాణా ద్వారా సామర్లకోట రైల్వేస్టేషన్‌కు రవాణా చార్జీలుగా రూ.70 లక్షల ఆదాయం సమకూరడమేగాక 100 లారీలకు, 20ట్రాక్టర్లకు ఎగుమతులు, దిగుమతుల ద్వారా రూ.15లక్షలు, 100 మంది హమాలీ కూలీలకు రూ. 4.50లక్షల మేర ఉపాధి లభించింది. రానున్న 20 రోజులలో మరో 10వేల మెట్రిక్‌టన్నుల మేర పచ్చిబియ్యం అస్సోం రాష్ట్రానికి ఎగుమతులు సామర్లకోట నుంచే రవాణా చేసేందుకు రైల్వే ఉన్నతాధికారులతో అంగీకారం కుదిరింది.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి, క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఆదాయం రూ.67.35లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం భక్తజనంతో కిటకిటలాడింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరుమాడవీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.67.35 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

తొలితిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తొలితిరుపతి శృంగారవల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 9వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.3,60,330 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో జనసందోహం

- శనివారం ఒక్కరోజు 7907 వ్రతాలు
- రూ.70 లక్షల ఆదాయం



సత్యదేవుడి దర్శనంకోసం బారులుతీరిన భక్తులు

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో సత్యదేవుడి సన్నిధి శనివారం భక్తజనసందోహంగా మారింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఒంటిగంట నుంచి వ్రతా లు, రెండుగంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులు అధికసమయం క్యూలైన్లలో అవస్థలు ఎదుర్కొన్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటల సమయం పట్టింది. రద్దీదృష్టా అంత్రాలయ దర్శనాలు నిలుపుదల చేశారు. 2000 వ్రతమండపంలో భక్తులు నిరీక్షణ అధికమవ్వడంతో అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్రతమండపాల ఖాళీనిబట్టి టిక్కెట్లు జారీ చేయాలని అన్నారు. 1500 అదనపు వ్రతమండపాలు ఏర్పాటుచేసినా భక్తుల సెంటిమెంట్‌కు వ్యతిరేకత రావడంతో వాటిలో నిర్వహించడం మానేశారు. చైర్మన్ రోహిత్ పశ్చిమరాజగోపురం లిఫ్ట్‌వద్ద నుంచి పర్యవేక్షించారు. ఒకదశలో తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న మెట్ల మార్గాన్ని మూసివేసి రద్దీ అనంతరం తెరిచారు. ఈవో సుబ్బారావు కమాండ్ కంట్రోల్‌రూం, వ్రతమండపపాలను పరిశీలించారు. శనివారం ఒక్కరోజు 7907వ్రతాలు, సుమారు రూ.70లక్షల ఆదాయం సమకూరింది.

వేడుకగా ప్రాకారసేవ

రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ప్రాకారసేవ శనివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామి,అమ్మవార్లను ప్రదక్షిణ గావించారు.

రేపు కాకినాడ వికాసలో ఇంటర్వ్యూలు

కాకినాడసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ (స్మార్ట్ బ్రెయిన్స్) కంపెనీలో ఉద్యోగాలకు ఈనెల 10న కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంవద్ద ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ కంపెనీలో నెట్‌వర్క్ ఇంజనీర్, డెస్క్‌టాప్ ఇంజనీర్, ఎల్1 స పోర్ట్, డేటా సెంటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు బీటెక్ (ఆల్‌స్ట్రీమ్స్), బీసీఏ, ఎంసీఏ 2019 నుంచి 2025లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఎడ్యుకేషన్‌లో ఒక సంవత్సరం అంతరాయం ఉన్నా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఆరు నెలల ట్రైనింగ్‌లో ఏడాది ప్రాతిపదికన రూ.2.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు జీతం, ట్రైనింగ్ అనంతరం రూ 3.5 లక్షల నుంచి రూ 3.8 లక్షల జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు తమ కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376222లో సంప్రదించాలన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు!

- టైరు పేలి బీభత్సం సృష్టించిన పెళ్లికారు
- రెప్పపాటులో ముగ్గురు బలి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- తొట్టిరిక్షా తోస్తున్న తాత, మనవడి మృతి
- బొప్పాయిలు విక్రయించే మరొకరు..
- సోమవరం బస్టాప్ వద్ద ఘటన

కిర్లంపూడి/ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురు సామాన్యులు.. కాయకష్టం చేసుకుంటేనే వారి జీవితం ముందుకు వెళ్తుంది. వారిపైకి ఓ పెళ్లికారు మృత్యురూపంలో దూసుకొచ్చింది. అతివేగం, నిర్లక్ష్యం.. దానికి తోడు ఒక్కసారిగా టైరు పంక్చర్ కావడంతో పెళ్లి కారు బీభత్సం సృష్టించింది. రెప్పపాటులో ముగ్గురిని బలితీసుకుంది. మరో ముగ్గురిని తీవ్రంగా గాయపరిచింది. దీంతో ప్రశాంతంగా ఉన్న అక్కడి వాతావరణం రోదనలతో మిన్నంటింది. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం జాతీయ రహదారిపై ఉన్న రిక్వెస్ట్ బస్టాప్ వద్ద శనివారం ఉదయం భీతావహ పరిస్థితి నెలకొంది. అన్నవరం నుంచి జగ్గంపేట వైపు ఓ పెళ్లికారు ఐదుగురితో కలిసి వెళ్తోంది. అతివేగం, నిర్లక్ష్యంగా వస్తుండగా సోమవరం బస్టాప్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా ముందు టైరు పంక్చర్ కావడంతో అక్కడే ఉన్న వారిపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్టాప్ వద్ద కాలేజీకి వెళ్లేందుకు విద్యార్థులు, స్థానికులు వేచిఉన్నారు. కారు అదుపుతప్పి మోటారుసైకిళ్లు, తొట్టిరిక్షా, విద్యార్థులు, స్థానికులను ఢీకొట్టింది. మోటారుసైకిల్‌పై బొప్పాయిలు అమ్ముకునేందుకు వచ్చిన ఏలేశ్వరానికి చెందిన కాకాడ రాజు(45), తొట్టిరిక్షా తోసుకుంటున్న తాతామనవళ్లు మోర్తా ఆనందరావు (65), మోర్తా కొండయ్య (30) మృతిచెందారు. జగ్గంపేట మండలం ఇర్రిపాకకి చెందిన ఇద్దరు నర్సింగ్ విద్యార్థులు చీపురుపల్లి ఫణీశ్రీ, కొండ్రాపు చైతన్య, సోమవరానికి చెందిన మరో వ్యక్తి బత్తిన భద్రం తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గాయాలపాలైన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

శ్రామికులే మృత్యువాత

ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రి ఆవరమంతా మృతుల కుటుంబీకుల రోదనలతో మిన్నంటింది. బొప్పాయి కాయల వ్యాపారి అయిన ఏలేశ్వరంలోని 11వ వార్డు పెద్ద వీధికి చెందిన కాకాడ రాజు మోపెడ్‌పై సోమవరం వెళ్లి బస్టాప్ వద్ద మృతిచెందాడు. అతడికి భార్య, ముగ్గురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. కాయకష్టం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే అతడు లేడనే వార్తను ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. అతడికి ఆరుగురు సంతానం కావడంతో కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. రిక్షా కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబానికి జీవనాధారం అయిన మోర్తా ఆనందరావు మృతి చెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూనే జీవనం సాగించే మోర్తా కొండయ్య కూడా మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. అతడికి భార్య, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. ముగ్గురు చిన్నపిల్లలు కావడంతో తమకు దిక్కెవరని, తాము రోడ్డు మీద పడ్డామని వారు రోధిస్తున్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఇన్‌చార్జి ఎస్ఐ టి.రఘునాథరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును ఎక్స్‌కవేటర్ సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. విషయం తెలుసుకున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెంటనే సంఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతులకుటుంబీకులతో మాట్లాడి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించేలా ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతుల కుటుంబాలను ఓదార్చారు. తీవ్రగాయాలపాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఫోన్‌లో కాకినాడ జీజీహెచ్ వైద్యులకు సూచించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. రెండు మృతదేహాలకు ప్రత్తిపాడు సీహెచ్‌సీలో, ఒక మృతదేహానికి జగ్గంపేట సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేశారు. ఆసుపత్రుల వద్ద మృతుల బంధువుల రోదనలు స్థానికుల కంటకన్నీరు పెట్టించింది. దీనిపై ఎస్ఐ రఘునాథరావు కేసు నమోదు చేయగా సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద ఘటనను ఎమ్మెల్యే నెహ్రూ సీఎంకు వివరించగా వెంటనే మృతుల కుటుంబీకులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందించాలని సూచించడంతో ఆయన సీహెచ్‌సీలకు వెళ్లి అందజేశారు. బాధిత కుటుంబాలను వైసీపీ ప్రత్తిపాడు కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్నాల కోట శ్రీను పరామర్శించారు.





ప్రమాదంలో పాడైన మోటారుసైకిళ్లు



ఓదార్చుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఇద్దరి పరిస్థితి విషమం

జీజీహెచ్ (కాకినాడ) నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు క్షతగాత్రులు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. శనివారం సోమవరంలో బస్టాప్‌లో నిలబడి ఉండగా అదుపుతప్పిన కారు అక్కడ ఉన్నవారిపై నుంచి వెళ్లడంతో ఘటనాస్థలిలో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా, ఇద్దరు విద్యార్థినులు, ఒక పురుషుడు గాయపడ్డారు. వారిలో దుర్గచైతన్య, భద్రం పరిస్థితి విషమంగా ఉన్నట్టు అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు.



చికిత్స పొందుతున్న దుర్గచైతన్య

ఓ శుభకార్యానికి హాజరై వస్తుండగా..

- బుల్లెట్‌తో గోడను ఢీకొట్టిన ముగ్గురు వ్యక్తులు
- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు



వరప్రసాద్ (పాతచిత్రం)

పి.గన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ శుభకార్యానికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా మృత్యువు వారిపైకి దూసుకువచ్చింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ విషాద ఘటన పి.గన్నవరంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.... కపిలేశ్వరపురం మండలం పల్లపులంకకి చెందిన మోరంపూడి వర ప్రసాద్ (28), బురుగు నాగేంద్ర (28), మల్లిడి విజయ్(26) తమ బుల్లెట్ వాహనంపై పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరై కె.ఏనుగుపల్లి ఏటిగట్టు రోడ్డున ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో పి.గన్న వరం శివారు పల్లేరువారిపేట సమీపంలోకి వచ్చేసరికి రహదారి చెంతనే ఉన్న ఒక ఇంటి గోడను బలంగా ఢీకొట్టారు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న వరప్రసాద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి 108 సాయంతో అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు వరప్రసాద్‌కు భార్య, పాప, బాబు ఉన్నారు. చికిత్స పొందుతున్న విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బీ.శివకృష్ణ తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పట్టణంలోని మెరకవీధి గోదావరిమాత విగ్రహం వద్ద సీతారామ స్నానఘట్టం సమీపంలోని చర్చి పక్కన గోదావరి నదిలో మగ మృతదేహం బోర్లాపడి ఉందని స్థానికులు పోలీసులకు శనివారం సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానిక జాలర్ల సహాయంతో మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరిలించారు. మృతదేహం పూర్తిగా డీకంపోజ్ అయిపోయి ఉంది. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు. ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్, 9440796622 నెంబర్‌కు సమాచారం అందజేయాలని సీఐ పి.విశ్వం తెలిపారు.

నమ్మించి.. చంపేశారు!

- శ్రీనివాస్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ప్రధాన నిందితుడు జీకే గ్రాండ్ అధినేత, మాజీ రౌడీషీటర్ కాసుబాబు
- పాతకక్షలు, సోషల్‌మీడియా ఆడియోతో ప్రతిష్ట దెబ్బతిందని హత్యకు పథకం
- మరో ఏడుగురు నిందితులు అరెస్టు
- హత్య కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



విలేఖరులకు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంచలనంగా మారిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితులు సహా 8 మందిని అరెస్టు చేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా శనివారం జరిగిన విలేకరుల సమావేశం వెల్లడించారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును ఛేదించి బృందాలుగా ఏర్పడి ముద్దాయిలను అరెస్టు చేయడంలో కీలకంగా పనిచేసిన అమలాపురం పట్టణ పోలీసులను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం డీఎస్పీ ప్రసాద్‌లు పాల్గొన్న మీడియా సమావేశంలో ఎస్పీ కంచిపల్లి శ్రీను హత్య కేసు వివరాలను వెల్లడించారు. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. అమలాపురం పట్టణం కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37)కు అమలాపురం పట్టణానికి చెందిన జీకే గ్రాండ్ అధినేత గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు (కాసుబాబు) మధ్య ఆర్థికపరమైన లావాదేవీల తో వైషమ్యాలు తలెత్తాయి. కాసుబాబుపై గతం లో రౌడీషీట్ ఉంది. ఈ క్రమంలో కాసుబాబును కంచిపల్లి శ్రీనివాస్ దూషించినట్టు సోషల్ మీడియాలో ఆడియోలు వైరల్ అయ్యాయి. అప్పటికే అప్పులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కాసుబాబు ఈ ఆడియో రికార్డు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో తన ప్రతిష్ట దెబ్బతిన్నట్టుగా భావించి ఉనికి చాటుకోవాలని, ప్రజల్లో భయాన్ని కలిగించాలనే ఉద్దేశంతో కంచిపల్లి శ్రీనవాస్‌పై అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇదిలా ఉండగా శ్రీనివాస్ గత నెల 25న తన భార్యకు రాజమహేంద్రవరం వెళుతున్నానని ఫోన్‌లో చెప్పాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గత నెల 27న శ్రీనివాస్ కిడ్నాప్‌కు గురయ్యాడని, పలువురిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పట్టణ పోలీసులు కంచిపల్లి శ్రీను అదృశ్యానికి సంబంధించి కేసును నమోదుచేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేశారు. శ్రీనివాస్ ఆరోజున చివరిసారిగా అమలాపురం పట్టణం ఏఎంజీ కాలనీవీధికి చెందిన సలాది రాంబాబు అలియాస్ అప్పన్నతో తిరుగుతున్నట్టు కొందరు సాక్షులు గుర్తించారు. దీంతో పోలీసులు విచారణ జరపగా చిక్కుముడి వీడింది. ఆడియోలు వైరల్ అయిన నేపథ్యంలో కాసుబాబు, అడబాల శంకర్ శ్రీనివాస్‌ను హత్య చేయాలని కుట్ర పన్నారు. ఈ పనిని సలాది రాంబాబుతోపాటు భాస్కర్ల దుర్గానాగప్రసాద్‌కు అప్పగించారు. 25వ తేదీ రాత్రి వీరు పలుచోట్ల మద్యంకొనుగోలు చేశారు. రాత్రి 11 గంటల సమయంలో కంచిపల్లి శ్రీనును కారులో తీసుకువెళ్లి అంబాజీపేట మండలం వక్కలంక గ్రామం దగ్గర మద్యం సేవించారు. ఆ తరువాత సలాది రాంబాబు, భాస్కర్ల దుర్గానాగప్రసాద్ కత్తితో శ్రీనివాస్‌పై దాడిచేసి హత్యచేశారు. మత్యదేహాన్ని కారు వెనుక సీటులోవేసి ఆ దృశ్యాలను వీడియో కాల్ ద్వారా ప్రధాన నిందితుడిగా పేర్కొనబడ్డ గంగుమళ్ల కాసుబాబుకు చూపించారు. అనంతరం శ్రీనివాస్ మృతదేహాన్ని పి.గన్నవరం మండల పరిధిలోని వైనతేయ నదిలో గోదావరిలో పడేశారు. ఆ మృతదేహం గతనెల29న మధ్యాహ్నం 1 గంటకు పి.గన్నవరం మండల ఆర్.ఏనుగుపల్లిలో మృతదేహాన్ని వెలికితీసి తరువాత శ్రీనివాస్ శరీరంపై గాయాలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు.

నిందితుల వివరాలు ఇలా..

కంచిపల్లి శ్రీనివాస్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా అమలాపురం పట్టణానికి చెందిన గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు (కాసుబాబు)తో పాటు హత్య చేసిన, సహకరించిన ఈదరపల్లికి చెందిన అడబాల శంకర్‌బంగారు, పట్టణంలోని ఏఎంజీ కాలనీకి చెందిన సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, మార్కెట్‌వీధికి చెందిన భాస్కర్ల దుర్గానాగప్రసాద్, అమలాపురం రూరల్ మండలం రెడ్డిపల్లికి చెందిన కరాటం నరేష్, రాజోలు మండలం వేగివారిపాలెంకు చెందిన యర్రంశెట్టి లింగయ్యానాయుడు, తెలంగాణ రాష్ట్రంలోని మేడ్చల్ జిల్లా దొమ్మగూడెంనాగారంకు చెందిన మోరం సత్యగంగామాణిక్యాలరావు అలియాస్ సతీష్, అదే ప్రాంతానికి చెందిన మోరం వీరవెంకటసత్యశ్రీనివాస్‌లను ఈ కేసులో నిందితులుగా అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు కార్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, సుజుకి యాక్సిస్ స్కూటర్, హత్యకు వాడిన కత్తి ఒకటి, 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పెంటపాటి అనిల్ అనే మరో వ్యక్తి దొరకాల్సి ఉందని తెలిపారు. ఈ కేసులో హత్యకు గురైన శ్రీనివాస్‌ను కిరాతకంగా చంపారని వస్తున్న వార్తలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఎస్పీ బదులిచ్చారు. హత్యకు గురైన శ్రీనివాస్ నాలుక కోయలేదు. కళ్లు పీకలేదు. శిరోముండనం చేయలేదని స్పష్టంచేశారు. నాలుగు రోజుల పాటు మృతదేహం నీటిలో ఉండడం వల్ల ఒంటిపై ఉన్న వెంట్రుకలు ఊడిపోయాయని తెలిపారు. కాగా ఈ కేసును ఛేదించడంలో కీలకంగాపనిచేసిన పట్టణ సీఐ వీరబాబు, ఇతర సిబ్బందిని ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.

ఈ నెల 12, 13 తేదీల్లో రాష్ట్రస్థాయి

సివిల్ సర్వీసెస్ క్రీడలకు ఎంపికలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడల కోసం తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 12, 13 తేదీల్లో రాజమహేంద్రవరంలోని వివిధ వేదికల్లో జరుగుతాయని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈ నెల 12న రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ క్రీడల ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అదే రోజు స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, ఫుట్‌బాల్, యోగా, ఫ్యాట్ టు ఫిట్ జిమ్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. దానవాయిపేట ప్రాంగణంలో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ విభాగాల్లో ఎంపికలు ఉంటాయని తెలిపారు.13న హుకుంపేటలోని బొప్పన అకాడమీలో బ్యాడ్మింటన్, చరణ్ కార్తీక్ టీటీ అకాడమీ (ఏవీ అప్పారావు రోడ్డు)లో టేబుల్ టెన్నిస్, ఎస్‌కేవీటీ కళాశాలలో స్విమ్మింగ్, హాకీ, లాన్ టెన్నిస్, రెజ్లింగ్ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే డ్యాన్స్, మ్యూజిక్, షార్ట్ ప్లే విభాగాల్లో కూడా ఎంపికలు జరుగుతాయని పురుషులు, మహిళలకు (ఓపెన్ కేటగిరీ- నాన్ యూనిఫాం ప్రభుత్వ ఉద్యోగులు) పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో జరుగుతాయని, క్రీడాపోటీల్లో పాల్గొనదలచినవారికి ఎలాంటి టీఏ, డీఏ ఇవ్వబడదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 90329 34038లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మరణించింది. కొత్తపల్లి మండలం కాశీవారిపాకలకు చెందిన వాసంశెట్టి చంద్రమ్మ(72) తన మనవడితో కలిసి శనివారం పట్టణంలోని ఓ ఆసుపత్రికి వచ్చింది. చికిత్స అనంతరం బైక్‌పై ఇంటికి వెళుతుండగా జారిపడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించగా మరణించింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

సులువుగా డబ్బు సంపాదించాలని..

చోరీల బాట

- ఐదుగురు వాహన దొంగలు అరెస్ట్
- రూ. 60 లక్షల విలువైన ఆటోలు, మోటారుసైకిళ్లు స్వాధీనం
- కాకినాడ ఎస్పీ బిందుమాధవ్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వారు ఎనమండుగురు స్నేహితులు. ఎవరికి వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటోలు నడుపుతూ వారి రెక్కల కష్టంతో జీవనం సాగిస్తుంటారు. అయితే వీరికి పాత నేరస్థుడైన ఆటో డ్రైవర్ స్నేహితుడు కావడంతో అతను వారందరిలో కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనను నూరి పోసాడు. అప్పటి నుంచి వారందరు కలిసి కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, అనకాపల్లి, పశ్చిమగోదావరి జిల్లాల్లో యథేచ్ఛగా నేరాలు చేస్తూ చివరికి కాకినాడ పోలీసులకు చిక్కారు.వారి నుంచి రూ.48 లక్షల విలువ చేసే 18 ఆటోలు, రూ.12 లక్షల విలువ చేసే 22 మోటారుసైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ నిందితుల వివరాలను వెల్లడించారు. శుక్రవారం రాత్రి పిఠాపురం మండలం విరవాడ గ్రామంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు 8 మంది అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. వారిని ఆపే క్రమంలో ముగ్గురు వ్యక్తులు తప్పించుకోగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా ప్రధాన నిందితుడు, పాత నేరస్థుడైన కాకినాడ రూరల్ మండలం తూరంగి డ్రైవర్స్ కాలనీకి చెందిన పెమ్మాడి ఆశీర్వాదం, శివకృష్ణ కాలనీకి చెందిన పెందుర్తి లోవరాజు, కాకినాడ గోలీలపేటకు చెందిన కొల్లి దుర్గాప్రసాద్ అలియాస్ కిమ్స్, కరప మండలం బావారం గ్రామానికి చెందిన కాల కృష్ణఅర్జున్, కాకినాడ జగన్నాథపురం, ముత్తానగర్‌కు చెందిన కనుమూరి గణేష్‌లుగా వారిని గుర్తించారు. పరారీ ఉన్న వారిలో కాకినాడ ఏటిమొగకు చెందిన పెమ్మాడి వీరబాబు, స్థానిక జగన్నాథపురానికి చెందిన తోట శివ, రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన పితాని దుర్గ ఉన్నారని ఎస్పీ మాధవ్ తెలిపారు. వీరు ఇళ్ల వద్ద పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవారన్నారు. ముఖ్యంగా హ్యాండిల్ లాక్ వేయని ఆటోలను తాడు సహాయంతో ఇంజన్ వెనుకభాగం నుంచి స్టార్ట్ చేసి దొంగిలించేవారు. మోటారుసైకిళ్లను మారు తాళాలతో తెరిచి తస్కరించే వారు. కాకినాడ జిల్లాలో 5 ఆటోలు, 11 మోటారుసైకిళ్లు, కోనసీమ జిల్లాలో 2 ఆటోలు, 3 మోటారుసైకిళ్లు, తూర్పుగోదావరి జిల్లాలో ఒక ఆటో, రెండు మోటారుసైకిళ్లు, అనకాపల్లి జిల్లాలో 9 ఆటోలు, 3 మోటారుసైకిళ్లు, ఏలూరు జిల్లాలో రెండు మోటారుసైకిళ్లు, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక ఆటో, ఒక మోటారుసైకిల్ వెరసి 18 ఆటోలు, 22 మోటారుసైకిళ్లను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ బిందుమాధవ్ పేర్కొన్నారు. ఈ కేసులు ఛేదించడంలో కృషి చేసిన క్రైం ఎస్ఐ బి.వినయప్రతాప్, టౌన్ ఎస్ఐ వి.మణికుమార్, క్రైం ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావు, హెచ్‌సీ గొప్పు చిన్న తదితర సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, కాకినాడ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, పిఠాపురం టౌన్ సీఐ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటోలు, మోటారుసైకిళ్లు

పోటాపోటీగా జూడో చాంపియన్‌షిప్



జూడో విజేతలకు మెడల్స్ అందించిన కైకలూరు సీఐ రవికుమార్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) జూడో చాంపియన్‌షిప్ అండర్-17 బాలబాలికలకు పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో రెండో రోజైన శనివారం కొనసాగాయి.

విజేతలు వీరే..

బాలికలు.. 36 కిలోల విభాగంలో.. నందిని(అనంతపురం), చాందిని(విశాఖ), ఐశ్వర్య(తూర్పు), అఖిలాండేశ్వరి విజేతలుగా నిలిచారు. 40 కిలోల విభాగంలో.. యస్వంత(అనంతపురం), గీతిక(చిత్తూరు), జ్యోతి(తూర్పుగోదావరి), జ్ఞానశృతి(కర్నూలు), 44 కిలోల విభాగంలో జాహ్నవి(అనంతపురం), శైలజ(చిత్తూరు), అరుణకాంతం(తూర్పు), స్నేహలత(కృష్ణ) విజేతలుగా నిలిచారు. 70 కిలోల విభాగంలో అమూల్య(గుంటూరు), శృతికీర్తన(కర్నూలు), మధులత(చిత్తూరు), నందిని(అనంతపురం), 90 కిలోల విభాగంలో అన్నపూర్ణ(చిత్తూరు), పూజ(అనంతపురం), దీవెన(తూర్పు), జాహ్నవి(విశాఖ) విజేతలుగా నిలిచారు.

బాలురు.. 45 కిలోల విభాగంలోయశ్వంత్(అనంతపురం), హిమతే(కర్నూలు), స్వర్ణన్(తూర్పు), చరణ్(నెల్లూరు), 40 కిలోల విభాగంలో కార్తిక(అనంతపురం), పాల్(కర్నూల్), లిఖిత్‌కుమార్(కృష్ణ), ప్రసాద్(గుంటూరు) విజేతలుగా నిలిచారు. విజేతలకు ముఖ్యఅతిథులుగా హాజరైన కైకలూరు సీఐ రవికుమార్, ఎస్ఐ రాంబాబు చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు.

ముగిసిన స్క్వాష్ చాంపియన్‌షిప్

కాకినాడలో జరుగుతున్న అంతర్‌జిల్లాల ఏపీఎఫ్ స్క్వాష్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. అండర్-14 బాలురు విభాగంలో ప్రభుకిరణ్(తూర్పు), రమణ(తూర్పు), కార్తికేయ(తూర్పు), హరణ్య(తూర్పు), శశాంత్‌రెడ్డి(చిత్తూరు), వివేకానంద(గుంటూరు), ప్రేమ్‌సాయి(చిత్తూరు), అండర్-17 విభాగంలో తహప్రజ్(తూర్పు), సూరజ్(తూర్పు), అండర్-19 విభాగంలో అఖిల్(తూర్పు), సౌర్య(తూర్పు), బాలికల అండర్-14 విభాగంలో తూర్పుగోదావరికి చెందిన బ్లెస్సీ, మహాలక్ష్మీ, మేఘన, కీర్తన, అండర్-17 విభాగంలో అబిజ్ఞ, ఐశ్వర్య, రూపశ్రీ, తేజశ్విని, వేణు అండర్-19 విభాగంలో రూపశ్రీ, వెన్నెల, శ్రేయసుహాషిత, దేవి తదితరులు విజేతలుగా నిలిచారు. డీఎస్ఈవో సతీష్‌కుమార్, ఎంఈవోలు టీవీఎస్ రంగారావు, బి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అబ్జర్వర్‌గా ఎస్కే బాబు వ్యవహరించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఎఫ్ కార్యదర్శులు సుధారాణి, కె.శ్రీనివాసరావు, జిల్లా పీఈటీ సంఘ కార్యదర్శి మాచరరావు, హాకీ కోచ్ రవిరాజు, పీడీలు బంగారాజు, లంకా జార్జి, వి.రవిరాజు పరశరాం, మంగయమ్మ, నాగమణి, దీప్తి, ఎస్తేర్, సూరిబాబు, మూర్తి పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో గంజాయి విక్రయాలు

- ఆరుగురు సభ్యుల ముఠా అరెస్టు
- రాజోలు సీఐ నరేష్‌కుమార్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఫేక్ ఐడీతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గంజాయిని విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్టు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. రాజోలు పోలీసు సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాలతో కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షణలో సీఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో గంజాయి నిందితుల రీవిజిట్ ప్రోగ్రాంలో భాగంగా పాత నేరస్తులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్న క్రమంలో ఈ నెల 7న గంజాయి విక్రయంపై సమాచారం అందింది. మండల కేంద్రం రాజోలులోని ఒక ఇంట్లో మలికిపురం మండలం గూడపల్లి గ్రామానికి చెందిన బి.విశాల్ గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు తెలిసింది. గూడపల్లికి చెందిన విశాల్, పడమటిపాలెం గ్రామానికి చెందిన డి.లక్ష్మీనాగనరసింహారావు, రాజోలు మండలం చింతలపల్లికి చెందిన ఎం.సూర్యకిరణ్, పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం దొడ్డనపూడికి చెందిన ఎస్.లక్ష్మీమురళీధర్, రాజోలు మండలం చింతలపల్లికి చెందిన సీహెచ్ రవితేజ, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పాలేనికి చెందిన టి.జాన్‌సుభాకర్ గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 2కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.నిందితులను విచారించగా విశాల్ ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అక్కౌంట్ క్రియేట్ చేసి అందులో కొందరు యువకుల ను ఫ్రెండ్స్‌గా చేర్చుకుని తనకు పరిచయం ఉన్న గూడపల్లి పంచాయతీ పల్లిపాలేనికి చెందిన ఎం.నాగేంద్ర వర్మ వద్ద నుంచి గంజాయి కొని తెచ్చి గ్రూపులో ఉన్న వారందరికీ అమ్ముతూ ఆ డబ్బును చెడు వ్యసనాలకు బానిసై విలాసాలకు ఉపయోగించుకుంటున్నాడు. గంజాయి అక్రమ రవాణాను నివారించడంలో భాగంగా ఆపరేషన్ సేవ్ క్యాంపస్ అని స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటుచేసి డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. గంజాయికి సంబంధించి హాట్‌స్పాట్ ఏరియాలను కూడా గుర్తించామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబరు 1972కు తెలియజేయాలని కోరారు. కాగా నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పాపికొండలకు 500 మంది పర్యాటకులు

వీఆర్‌పురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని పాపికొండలు, పేరంటాలపల్లికి శనివారం 500 మంది పర్యాటకులు రావడంతో 9 బోట్లల్లో పాపికొండల విహారయాత్రకు వెళ్లారు. ఇటీవల మొంథా తుఫాన్ అనంతరం ఈ నెల 2వ తేదీ నుంచి పర్యాటకం ప్రారంభించారు. శనివారం సెలవు దినం కావడంతో పోచవరం ఫెర్రి పాయింట్ వద్ద పర్యాటకుల రద్దీ కాస్తా ఎక్కువగానే ఉంది. ముందుగా పర్యాటక బోట్లల్లో పేరంటాలపల్లి చేరుకొని అక్కడ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ ప్రాంత కొండరెడ్లు వెదురుతో తయారు చేసిన పలు రకాల వస్తువులు, అందమైన అల్లికలను కొలుగోలు చేశారు. తర్వాత విహారయాత్ర బోట్లపై పాపికొండలు వెళ్లి ప్రకృతి అందాలను ఆస్వాదించి తిరుగు ప్రయాణం సాగించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



పి.దొంతమూరు శివారులో అసంపూర్తిగా నిలిచి పోయిన బ్రిడ్జి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలంటూ ఆందోళన

● నిరాహార దీక్ష చేపట్టిన పి.దొంతమూరు గ్రామస్థులు

పిఠాపురంరూరల్, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): మండలం పి.దొంతమూరు గ్రామ శివారులో సుద్దగడ్డ కాలువపై మధ్యలో నిలిచిపోయి బ్రిడ్జి నిర్మాణాన్ని, అప్రోచ్ రోడ్డును త్వరిత గతిన పూర్తిచేయాలని డిమాండ్‌చేస్తూ పి.దొంతమూరు, చినజగ్గంపేట గ్రామస్థులు శుక్ర, శనివారాల్లో ఆందోళనలు నిర్వహించారు. కాలువలోని నీటిలోకి దిగి నిరసన తెలిపారు. బ్రిడ్జి ప్రాంతంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. పదేళ్ల క్రితం బ్రిడ్జి నిర్మించి అప్రోచ్‌లు నిర్మించకుండా వదిలివేశారని తెలిపారు. దీంతో అయిదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని వారు కోరారు. తమ డిమాండ్లు నెరవేరే వరకూ దీక్ష కొనసాగిస్తామని తెలిపారు. ఆందోళనలో పి.దొంతమూరు, చినజగ్గంపేట గ్రామస్థులు పాల్గొన్నారు.

చేయూత సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకం

● మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, సూర్యారావును సత్కరిస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ సిటీ, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): చేయూత సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్రకార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం పేర్కొన్నారు. చేయూత సేవాసంస్థ 8వ వార్షికోత్సవ వేడుకలు శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మొండి రవికుమార్ అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా మంత్రి సుభాష్, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీలు పద్మశ్రీ, రాజశేఖరం పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ సొంతంగా రూ.లక్ష, ఎంపీ లాడ్స్ నుంచి రూ.5లక్షలు అందజేయగలనన్నారు. మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ చేయూత సంస్థకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపినాథ్ రూ.15వేలు విరాళం చెక్కు అందజేశారు. అనంతరం సంస్థ ద్వారా పేద విద్యార్థులకు చదువు నిమిత్తం సహాయం, ఓ దివ్యాంగుడికి ట్రై సైకిల్, ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లు, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న 200మంది చిన్నారులకు ఒక్కొక్కటి రూ.1250 విలువచేసే పౌష్టికాహార కిట్లు అందజేశారు. అలాగే 130 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. సంఘ సేవకుడు డాక్టర్ తురగా సూర్యారావును మంత్రి సుభాష్ శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత జి.శ్యామ్, సంస్థ సభ్యులు చింతా నారాయణమూర్తి, ఎస్‌కె వలి భాషా, పలువురు ప్రతి నిధులు వి.శ్రీకాంత్, ఆచారి పాల్గొన్నారు. తొలుత సూ ర్యనృత్య నికేతన్ విద్యార్థినుల ప్రదర్శన ఆకట్టుకుంది.

పిఠాపురంలో విజేత సూపర్‌మార్కెట్ ప్రారంభం



పిఠాపురంలో విజేత సూపర్‌మార్కెట్‌ను ప్రారంభిస్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో బ్రాండుగా నిలిచిన విజేత సూపర్ మార్కెట్ తమ 116వ స్టోరును పిఠాపురంలో ఏర్పాటుచేసింది. ఈ విజేత సూపర్‌మార్కెట్‌ను శనివారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ప్రారంభించారు. వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించే విజేత సూపర్‌మార్కెట్ పిఠాపురంలో ప్రారంభించడం సంతోషంగా ఉందని ఎంపీ అన్నారు. విజేత సూపర్‌మార్కెట్ ప్రతినిధులు మాట్లాడుతూ ఉభయ తెలుగురాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లో విస్తరించి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తామన్నారు. విజేతలుగా మా ప్రయాణంలో అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన కుటుంబసభ్యులకు, ఉద్యోగ సహచరులకు ప్రత్యేకదన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందికి భక్తులకు మధ్య వివాదం

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో శనివారం వీరభద్రుడి సంబరం ఉత్సవ నిర్వాహకులకు ఆలయ సిబ్బందికి మధ్య వివాదం నెలకొంది. ఒక దశలో భక్తులు ఆలయ సిబ్బందిపై చేయిచేసుకునే వరకూ వెళ్లింది. ఆ సమయంలో ఆలయాధికారులు ఉన్నా వివాదం జోలికి వెళ్లలేదు. వివరాల్లోకి వెళితే.. సామర్లకోట మఠం సెంటర్‌కు చెందిన వ్యాపారి కుటుంబీకులు వీరభద్రుడి సంబరం ఉత్సవం నిర్వహించుకునేందుకు ఆలయ ఆవరణలోని వీరభద్రుడి ఉపాలయానికి వస్తుండగా వారిని అడ్డుకోవడంతో ఈ వివాదం తలెత్తింది. కొందరు దీక్షాధరులు నిత్యాన్న భోజన పథకం నిర్వహణలపై చేస్తున్న ఆరోపణల కారణంగా శనివారం ఉపాలయం వద్దకు రాకుండా ఆలయ సిబ్బంది అడ్డుకున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. స్వల్ప వివాదం కాస్తా శనివారం తిట్ల పురాణానికి దారితీసింది. దీంతో భక్తులు తీవ్ర అసహనానికి గురైనట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇంత వివాదం జరుగుతున్నా ఆలయ అవుట్‌పోస్ట్ పోలీస్టేషన్‌లో ఒక్క సిబ్బంది లేకపోవడం విచారకరం.దూర ప్రాంతాల నుంచి ఈ ఆలయానికి వస్తున్న భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లకుండా ఆలయ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపైనే ఉందని పలువురు భక్తులు అంటున్నారు. ఇటువంటి వివాదాలు పునరావృతం గాకుండా ఆలయాధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యక్తి మృతిపై అధికారుల విచారణ



సీహెచ్‌సీలో ట్రైనీకలెక్టర్ మనీషా విచారణ చేస్తున్న దృశ్యం

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారంరాత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పట్టణానికి చెందిన మలిరెడ్డి భూచక్రం మృతిచెందిన సంఘటనకు దారితీసిన పరిస్థితులపై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాల మేరకు శనివారం సామర్లకోట సీహెచ్‌సీలో ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆధ్వర్యంలో సమగ్ర విచారణ నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై మృతుని కుటుంబీకులు ఆందోళన చేసిన విషయం విదితమే. వాస్తవ సమాచారాన్ని తెలుసుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్ తదితర నాయకులను ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఇరువర్గాలతోనూ చర్చించి నివేదికలు రూపొందించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పార్టీ నాయకులకు సూచనలు చేశారు. శనివారం సాయంత్రం ఆర్డీవో మల్లిబాబు ఆధ్వర్యంలో విచారణ బృందం సామర్లకోట సీహెచ్‌సీ ఆసుపత్రి కి చేరుకున్నారు. ట్రైనీ కలెక్టర్ మనీషా, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ స్వప్న, ఆరోపణలకు గురైన డాక్టర్ వరలక్ష్మి తదితర ఆసుపత్రి సిబ్బందిని వేర్వేరుగా అధికారుల బృందం విచారించింది. మృతుడు భూలోకం కుటుంబసభ్యుల నుంచి వాస్తవ సంఘటనలపై అధికారులు ఆరా తీశారు. డాక్టర్ వరలక్ష్మి నుంచి ఆసుపత్రి సిబ్బంది నుంచి మాత్రమేగాక పలువురు కౌన్సిలర్ల నుంచి సైతం సమాచారాన్ని సేకరించారు. పూర్తి నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఆర్డీవో మల్లిబాబు విలేకరులకు తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను అధికారుల బృందం సేకరించారు. ఈ విచారణలో సామర్లకోట డిప్యూటీ తహశీల్దార్ వైశ్రీనివాసు, వీఆర్వోలు నలజర్ల మురళీకృష్ణ, కెవీవీ. శ్రీను, అప్పారావు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాల నిలుపుదలకు తీర్మానం

కాజులూరు(కరప), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డీఏపీ, యూరియా ఎరువుల విక్రయాలను సోమవారం నుంచి నిలుపుదలచేస్తూ కాజులూరు మండల ఫెర్టిలైజర్స్ డీలర్ల అసోసియేషన్ తీర్మానించింది. కాజులూరులో శనివారం మండల డీలర్లందరూ సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు తలాటం వెంకటరమణ(శ్రీను) మాట్లాడుతూ ఎరువుల కంపెనీలు డీఏపీ, యూరియాకు తమ ఇతర ఉత్పత్తులను లింక్‌చేసి బలవంతంగా అంటగడుతున్నారన్నారు. ఉపయోగంలేని ఆ ఉత్పత్తులను తీసుకోవడానికి రైతులు నిరాకరిస్తున్నారని, దీంతో వ్యాపారాలు సాగక దారుణంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులను కంపెనీలు వినే పరిస్థితి లేదని, ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి ఎరువులకు ఇతర ఉత్పత్తులు లింక్ పెట్టకుండా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. అప్పటివరకు ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నామని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు నల్లమిల్లి కాశీఈశ్వరరెడ్డి, ప్రధానకార్యదర్శి నందికోళ్ల శ్రీనివాసు, వి.పట్టాభి, చౌదాళ్ల రాజు, నందికోళ్ల శ్రీనివాసు, చోడిశెట్టి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధనకు విస్తృత ఏర్పాట్లు

● పరిశీలించిన ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరంజంక్షన్, నవంబరు 8(ఆంధ్ర జ్యోతి): కాకినాడరూరల్ మండలం పెనుమర్తిలో ఆదివారం కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో జరిగే 5వ కార్తీక వనసమారాధన కార్యక్రమ ఏర్పాట్లు చురుగ్గా సాగు తున్నాయి. కాకినాడరూరల్ నియోజకవర్గంతో పాటూ జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. వన సమారాధన ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే పంతం నానాజీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యవేక్షించారు. సుమారు 30 వేలమంది వరకు వనభోజనాలు చేసేందుకు వస్తారని అంచనాతో తాగునీరు, భోజనం చేసేందుకు 30 కౌంటర్లు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఖాదీ-విలేజ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు, కూటమి నాయకులు కరెడ్ల గోవిందు, తాటికాయల వీరబాబు, మాదారపు తాతాజీ, పుల్ల శ్రీరాములు, రంబాల వెంకటేశ్వరరావు, డిల్లీ నాయుడు, రామకృష్ణ, రాందేవు సీతయ్యదొర, కాకరపల్లి చలపతిరావు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ

పాడైన రోడ్లను వెంటనే నిర్మిస్తాం : ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా నగరంలో పాడైన రోడ్లను వెంటనే నిర్మించేలా చర్యలు చేపట్టామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వర్షాలు కారణంగా పాడైన ప్రధాన రహదారులైన వార్ఫ్‌రోడ్, చంద్రిక థియేటర్‌రోడ్, నరసింహరోడ్, ఘాటీ సెంటర్, మున్సబ్ సెంటర్, ఎంఎస్ఎన్ ఛార్టీస్, బాలయోగి సెంటర్ రోడ్లను శనివారం కొండబాబు ఆర్అండ్‌బీ, కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరంలోని కొన్ని ప్రధాన రహదారులు తుఫాను, వర్షాల కారణంగా గోతులు ఏర్పడి పాడయ్యా యన్నారు. ఈ పర్యటనలో ఆర్అండ్‌బీ, కార్పొరేషన్ అధికారు లతో పాటు స్థానిక నాయకులు పంతాడి రాజు, మేడిశెట్టి చి న్ని, పాలిక నాని, చొక్కా గిరి, కామాడి దశరథ, సంగాని నాగూ ర్, కోడా రమణ, శేషగిరిరావు, బూడి ప్రకాష్, గొరుసు దుర్గారా వు, ఎండీ ఖాన్, ఎండీ అన్సర్, బొడ్డు శివాజీ పాల్గొన్నారు.

బాలల దినోత్సవ వారోత్సవాలు

కాకినాడరూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ కాకినాడ అధ్యక్షుడు ఎస్.పాపారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన బాలల దినోత్సవ వారోత్సవాలను లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. వారోత్సవాల్లో భాగంగా ఔషధ గుణాలు కలిగిన మొక్కలు గురించి వివరణ, క్విజ్‌కాంపిటేషన్, చిత్రలేఖనం, ఫ్యాషన్‌షో పోటీలు జరుగుతాయని పిల్లలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పుత్రరావు, భాస్కరరావు, మరిడికుమార్, నూకాజీ, మోహన్‌కుమార్, రామసుబ్రహ్మణ్యం, జగన్నాధరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణా తరగతులు

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాతబస్టాండువద్ద గల రాజీవ్‌గాంధీ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు ఉపాధ్యాయులకు నిర్వహించిన సాల్వ్-టీచ్‌టూల్ శిక్షణా తరగతులు శనివారం సాయంత్రంతో ముగిశాయి. తరగతి గదిలో విద్యార్థులకు బోధించే విధానంలో నైపుణ్యం పెంచడం, క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై శిక్షణ ఇచ్చా రు. శిక్షణా తరగతుల్లో ఎంఈవోలు జి.శ్యాంబాబు, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తల సమావేశంలో ఎంపీ సతీష్‌బాబు



సమావేశంలో పాల్గొన్న ఎంపీ సతీష్‌బాబు

కాకినాడసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బీహార్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో శనివారం జరిగిన పారిశ్రామికవేత్తల సమా వేశంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌పాటు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి బీహార్ పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేష్, ఎంపీ సతీష్‌బాబు చర్చించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్డీఏ తరపున పాట్నాలో లోకేష్‌చేపట్టిన ఎన్నికల ప్రచారంలో సతీష్‌బాబు పాల్గొన్నారు.

పనసపాడులో ఉచిత నేత్ర వైద్యశిబిరం



సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పనసపాడు గ్రామంలో శనివారం పాస్టర్ ప్రభుదాసు ఆధ్వర్యంలో యోహావాయిరే చర్చి వద్ద ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో నేత్రాలయ ప్రాథమిక వైద్య సిబ్బంది సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కళ్లజోళ్ల అవసరం ఉన్నవారిని గుర్తించి మరో వారం రోజుల్లో అందజేయనున్నట్టు తెలిపారు.శస్త్రచికిత్స అవసరం ఉన్న వారిని గుర్తించి నేత్రాలయ వైద్యులు సూచించారు. కార్యక్రమంలో పలువురు చర్చి నిర్వాహకులు సేవలందించారు.

రాష్ట్ర సైన్స్‌డ్రామా పోటీల్లో గొల్లప్రోలుకు నాల్గో స్థానం



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరుకు చెందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇండస్ట్రీయల్ అండ్ టెక్నాలిజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో అమరావతిలోజరిగిన దక్షిణభారత సైన్స్ డ్రామా రాష్ట్రస్థాయి పోటీల్లో గొల్లప్రోలు పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నాల్గవ స్థానం సాధించారు. రాష్ట్రస్థాయిలో బెస్ట్ మేల్ యాక్టర్‌గా పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి సూర్యకిరణ్ ఎంపికయ్యారు. వీరికి నిర్వాహకులు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 26 టీము లు ఈ పోటీల్లో పాలుపంచుకున్నాయి. డ్రామా పోటీ ల్లో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులు, గైడ్ టీచర్‌గా వ్యవహరించిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు భారతిని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, ఎంఈవోలు వెన్నా శ్రీనివాస్, బి.శివప్రసాద్, హెచ్ఎం రాజ్యలక్ష్మీ, విద్యాకమిటీ ప్రతినిధులు అభినందించారు.

సమాజ సేవకు ముందుకు రావాలి

పెదపూడి(కరప), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నేను అనే భావనను వదిలి మనం అనే భావనతో సమాజసేవకు అందరూ ముందుకురావాలని కాకినాడ ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు పేర్కొన్నారు. పెదపూడి మండలం కరకుదురు గ్రామంలో శనివారం ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ సేవాశిబిరం ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ జాతీయ సేవా పథకం విభాగం ఆదేశాలమేరకు వారంరోజుల పాటు గ్రామంలో ఈ ఎన్ఎస్ఎస్ సేవాశిబిరాన్ని నిర్వహించనున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ నల్లమిల్లి సుగుణరెడ్డి, స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధాకర్, యూనివర్శిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావులు అభినందించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి ప్రార్థనాగీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ వి.సత్యనారాయణ, డీసీ చైర్మన్ సానా శ్రీ ను, బీజేపీ నాయకుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో సార్వా కోతలు ప్రారంభం

కొత్తపల్లి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): గోదావరి పిఠాపురం బ్రాంచికెనాల్(పీబీసీ)కింద ఉన్న కొత్తపల్లి మండలంలో సార్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు త్వరగా చేలను ఒబ్బిడి చేసుకునేందుకు సమాయత్తమవుతున్నారు. చేను కాస్త పసరుగా ఉన్నప్పటికీ మిషన్‌తో కోత కోయిం చుకొని అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. మిషన్‌తో కోయించిన పచ్చి ధాన్యానికి 75కిలోల బస్తాకు రూ.1,450లు, ఆరబెట్టిన ధాన్యానికి రూ.2,389లు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో రైతులు అయోమయంలో పడ్డారు. ప్రస్తుత వాతావరణం పరిస్థితుల కారణంగా ధాన్యం ఆరబెట్టేందుకు వీలుపడక పచ్చిధాన్యానికి మద్దతు ధర రూ.1,450లు ప్రకటించడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తంచేస్తు న్నారు. మిషన్‌తో కోతకొయించిన ధాన్యా న్ని కనీసం రూ.1,600లకు కొనుగోలు చేసే విధంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

ట్రస్ట్ ఆఫ్ బొండా ద్వారా సామాజిక సేవాకార్యక్రమాలు



విద్యాశాఖాధికారులను సత్కరిస్తున్న ట్రస్ట్ ఆఫ్ బొండా సభ్యులు

కరప, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ట్రస్ట్ ఆఫ్ బొండా ద్వారా పలు సామాజిక సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్టు ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ బొండా వెంకన్నరావు పేర్కొన్నారు. వేళంగి శ్రీనివాస నర్సింగ్‌హోమ్ ఆవరణలో శనివారం దివంగత బొండా పట్టాభిరామయ్య, కాశీవతి దంపతుల సంస్మరణార్థం నిర్వహించిన ట్రస్ట్ ఆఫ్ బొండా 20వ అర్ధసంవత్సర సమావేశంలో ఆయన మాట్లాడారు. గత దశాబ్ధకాలంగా ట్రస్ట్ ఆఫ్ బొండా ద్వారా పేద విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఫీజులు, చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి నగదు ప్రోత్సాహకాలు అందజేశామన్నారు. నిరుపేదలకు చీరలు, దుప్పట్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాల అబివృద్ధికి తోడ్పాటు నందించామన్నారు. అనంతరం 400 మంది పేదలకు దుప్ప ట్లు, ఆహారపొట్లాలు పంపిణీచేశారు. ఇంటర్ పస్టియర్ విద్యార్థిని సాయికి రూ.5వేలు, కాకినాడ దయా ఫౌం డేషన్‌కు రూ.5వేలు అందజేశారు. ట్రస్ట్ ఆఫ్ బొండా చేస్తున్న సేవాకార్యక్రమాలను అభినందిస్తూ బొండా కృతిహిమానిక రూ.20వేలు, పట్టాభిరామయ్య, కాశీవతి వారసులు రూ.30వేలు అందజేసి ఈ మొత్తాన్ని పేదవిద్యార్థుల చదువుకు ఉపయోగించాలని కోరారు. పెద్దాపురప్పాడు హైస్కూల్‌కు 5ఎకరాల స్థలాన్ని వితరణచేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే బిరుదా పకీర్రావు వారసులను, గొల్లప్రోలు ఎంఈవో పీవీ శివప్రసాద్, ఎన్‌సీసీ ఆఫీసర్ వీవీ రమణమూర్తి, వేళంగి హైస్కూల్ హెచ్ఎం త్రిమూర్తులు, వేములవాడలో భీమకవి ఆలయ నిర్మాణానికి కృషిచేసిన బండే తాతాజీలను సత్కరించారు.

భీమేశ్వరుడికి విశేష పూజలు

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):సామర్లకోట కుమార రామభీమేశ్వరాలయంలో శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. కార్తీకమాస మహాపర్వదినాలు పురష్కరించుకుని ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) తదితర ధర్మకర్తలమండలి సభ్యుల పర్యవేక్షణలో స్వామివారికి గోపూజలతో పూజలు ప్రారంభించారు. స్వామివారికి తొలిఅభిషేక పూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. శనివారం సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో వివిధ జిల్లాలకు చెందిన న్యాయమూర్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహనాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో అన్ని ఉపాలయాలను దర్శించిన అనంతరం భీమేశ్వరస్వామికి, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పూజలు చేశారు. నందిమండపం వద్ద వేదాశీర్వచనం చేశారు. రాజమహేంద్రవరం జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ అధికారి సతీసమేతంగా పూజలు నిర్వహించారు. గుంటూరుజిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి శరత్‌బాబు, కాకినా డ మూడో అడిషనల్ జిల్లా జడ్జి ఆనంది, ఆరవ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి గోవర్ధన్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధ దంపతులకు ఆర్థిక సాయం

తాళ్లరేవు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):కోరింగ గ్రామంలో చేకూరి అమ్మన్నకళావతి వృద్ధ దంపతులకు చెందిన తాటాకు ఇల్లు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు గమనించి వృద్ధులను సురక్షితంగా బయటకు తరలించారు. స్థానిక సర్పంచ్ పెయ్యల మంగేష్, శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి బాబి, పొన్నమండ రామలక్ష్మీలు బాధితులను పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోషా కల్పించారు.

ఈత పోటీల్లో బాలిక ప్రతిభ



ఈత పోటీల్లో ప్రతిభ కనబరిచిన పల్లవి

పెద్దాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్బీపట్నం గ్రామానికి చెందిన మన్యం పల్లవి 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఈత పోటీల్లో అండర్ 14 విభాగంలో 100 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో ప్రతిభ కనబరిచింది. విశాఖపట్నం ఆర్కేబీచ్‌లో ఉన్న ఆక్వాటెక్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన పల్లవిని పలువురు అభినందించారు.

శివలింగం వద్ద వర్మ పూజలు



గొల్లప్రోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 25 అడుగుల శివలింగాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సందర్శించారు. శివలింగం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

గుండెజబ్బులపై అవగాహన కలిగి ఉండాలి

● ట్రస్ట్ హాస్పటల్ కార్డియాలజిస్ట్ దుర్గా పవన్



డాక్టర్ దుర్గా పవన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బులపట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రస్ట్ హస్పటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.దుర్గాపవన్ అన్నారు. స్థానిక రోటరీ హాల్‌లో శని వారం రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ సమావేశం క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపినాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ దుర్గా పవన్ మాట్లాడుతూ గుండె జబ్బులపట్ల అవగాహనను వివరించారు. అనంతరం ప్రముఖ వైద్యుడు జీఎస్ మూర్తి చేతులమీదుగా డాక్టర్ దుర్గా పవన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ సాన ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి, నేతినాగేశ్వరరావు, మాజేటి పవన్, సత్తి రవిరెడ్డి, పరశురాం పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత స్పోకెన్ హిందీ శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడజిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ శిక్షకులు కేవీవీ సత్యనారాయణచే మహిళలకు ఉచిత స్పోకెన్ హిందీ శిక్షణ ఇవ్వనున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా, రాష్ట్ర చైర్మన్ వైడి రామారావు తెలిపారు. 18 సంవత్సరాలు నిండి పదోతరగతి ఉత్తీర్ణులైన మహిళలకు 45రోజులపాటు ఈ శిక్షణ ఇస్తామన్నారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న మొదటి 50 మంది మహిళలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈనెల 15 నుంచి శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగల మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 0884-2371409, 7671940992లో సంప్రదించాలన్నారు.

బియ్యం ఇవ్వలేదని లబ్ధిదారుల ఆవేదన

తాళ్లరేవు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): పోలేకుర్రు పంచాయతీ పరిధి రేషన్‌షాపు నెంబర్7లో తోటపేట గ్రామానికి చెందిన మొంథా తుఫాన్ బాధితులకు బియ్యం ఇవ్వకుండా అనర్హులకు ఇస్తున్నారని పలువురు లబ్ధిదారులు శనివారం ఆరోపించారు. రేషన్ డీలరు లబ్దిదారుల నుంచి వేలిముద్రలు వేయించుకుని బియ్యం ఇవ్వకుండా పంపిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారికి కాకుండా పక్కాడాబాల్లో ఉన్న వారికి బియ్యం వచ్చాయని అర్హులకు మొండిచేయి చూపించారని బాధితులు లబోదిబోమన్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్‌ను వివరణ కోరగా దళారుల ప్రమేయం ఉండదని లబ్ధిదారులందరికీ నేరుగా బియ్యం అందిస్తామని అన్నారు.

జ్యోతుల నవీన్ పరామర్శ

కిర్లంపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల గోనేడ గ్రామ మాజీ సర్పంచ్ నీలం వెంకయమ్మ మరణించారు. శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ గోనేడలోని వారి స్వగృహానికి వెళ్లి వెంకయమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుమారుడు సురేంద్రను పరామర్శించారు. వారి వెంట నీలం శ్రీను, అనుకుల శ్రీకాంత్, తూము కుమార్, గోకాడ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నేటి నుంచి ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన

వై.రామవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో 12మంది ట్రైనీ ఐఏఎస్‌లు ఆదివారం నుంచి ఈనెల 16వరకు పర్యటించనున్నారు. శనివారం రంపచోడవరం ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ పి.అంబేడ్కర్, డీఎస్పీ ప్రశాంత్ చవిటిదిబ్బలు, దాలిపాడు, యార్లగడ్డ గ్రామాలు సందర్శించి సచివాలయాలు, ఆశ్రమ పాఠశాల్లో వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. దాలిపాడు, యార్లగడ్డ పంచాయతీల పరిధిలో ట్రైనీ ఐఏఎస్‌లు పర్యటించి భౌగోళిక పరిస్థితులు, ప్రభుత్వ పథకాల విధివిధానాలపై విశ్లేషించనున్నారని అధికారులు తెలిపారు. ట్రైనీ కలెక్టర్ల పర్యటనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్‌ఐ రామకృష్ణలకు అధికారులు దిశానిర్దేశం చేశారు.

నేడు సిరిగిందలపాడులో వైద్య శిబిరం

రంపచోడవరం, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహరాజ్ తెలిపారు. సామాన్య రోగాలు, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మూర్ఛ వ్యాధిగ్రస్థులకు నాలుగు నెలలకు సరిపడా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఆధార్, రేషన్‌కార్డులను తీసుకురావాలన్నారు.

అంబేడ్కర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

చింతూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కుటుంబ సంక్షేమ సంఘ చింతూరు మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. శనివారం చింతూరులో దళిత సంఘ సమావేశం జరిగింది. సభకు భారీగా దళితులు హాజరయ్యారు. తొలుత సెంటరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ అధ్యక్షుడుగా సాగర్, కార్యదర్శిగా సుదర్శన్ కుమార్‌తో పాటు కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ సత్యనారాయణ, సంఘ కూనవరంమండల అధ్యక్షుడు రవీంద్ర మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. చింతూరు డివిజన్ పరిధి, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు చెందిన సంఘ నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

చింతూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రంపచోడవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టుం రాజబాబు డిమాండ్ చేశారు. శనివారం చింతూరులో బిర్సాముండా జయంత్యుత్సవాల సందర్భంగా ఆదివాసీ హక్కులు, చట్టాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడారు. రంపచోడవరాన్ని కారం తమన్న దొర జిల్లాగా ప్రకటించాలన్నారు. ఆదివాసీ ఆత్మఘోష పుస్తక రచయిత పాండు కాంటేక్టర్ మాట్లాడుతూ తమ సంప్రదాయాలను ప్రతి ఆదివాసీ గౌరవించాలన్నారు. గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముర్రం వీరభద్రం మాట్లాడుతూ మన్యంలో ఆదివాసీ సాగు భూములకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం మేరకు పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు.

రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన

దేవీపట్నం, నవరంబు 8(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు సెంటర్‌లో శనివారం ఎస్‌ఐ షరీఫ్ రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరిస్తే ప్రమాద సమయంలో ప్రాణాపాయం తప్పుతుందన్నారు.

గండిపోశమ్మ దర్శనం తాత్కాలిక నిలుపుదల

దేవీపట్నం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గొందూరులో వెలసిన గండిపోశమ్మ అమ్మవారి దర్శనం తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. గోదావరి పెరగడంతో ఆలయ పరిసరాల్లోకి నీరు చేరి, బురదతో నిండి ఉందన్నారు. దర్శనం తేదీ ప్రకటించే వరకు భక్తులు ఎవరూ ఆలయ పరిసరాల్లో రావద్దని సూచించారు.

రేపాకను 41కాంటూరులో చేర్చాలి

కూనవరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రేపాక గ్రామంలో సీపీఎంమండల సమావేశం జెట్టి మారయ్య అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి బాబు బోర్రయ్య మాట్లాడుతూ రేపాక గ్రామాన్ని 41 కాంటూరులో చేర్చి భూమి ప్యాకేజీ ఆర్‌అండ్‌ఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైడర్ సర్వే పేరుతో ముంపు బాధితులను తప్పుడు లెక్కలు చూపి గందరగోళం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సర్పంచ్ మడకం నాగమణి, మడకం బుజ్జి, మడకం సత్యనారాయణ, మడకం లక్ష్మీ ఉన్నారు.

'ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం'

ఎటపాక, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్, నిత్యావసరాల ధరలు నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఐద్వా మండల కార్యదర్శి పొడియం రత్తమ్మ విమర్శించారు. శనివారం గన్నవరంలో పెరుగుతున్న ధరలను నిరసిస్తూ గ్యాస్ బండలతో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినట్టు చెబుతున్నప్పటికీ సామాన్యులకు ఆ ఊరట లభించడంలేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తే నిత్యావసరాల ధరలు తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో కారం జయమ్మ, విజయకుమారి, కారం దుర్గ, సుశీల, అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం పీహెచ్‌సీకి మౌలిక సదుపాయాలు

మోతుగూడెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ రూ.3.20లక్షలతో మోతుగూడెం పీహెచ్‌సీకి మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు సమకూర్చింది. సదుపాయాలు సమకూర్చిన ల్యాబ్‌ను శనివారం సంస్థ వ్యవస్థాపకుడు శ్రీరామ్‌కుమార్, ఇతర వలంటరీ సంస్థల ప్రతినిధుల సమక్షంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.పుల్లయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అభిజ్ఞ ప్రారంభించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంపీటీసీ రమణ

మోతుగూడెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ కలిశారు. డొంకరాయిని మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలని కోరారు.పాల గెడ్డ నుంచి బొడ్డగండి రోడ్డు, మంగం పాడులో మధ్యలో నిలిచిపోయిన ఆసుపత్రి భవనం, వాల్మీకి కులధ్రువీకరం పత్రాలు జారీలో జరుగుతున్న ఇబ్బందులు, డొంకరాయి జిల్లా పరిషత్ హైస్కూల్‌కి శాశ్వత భవనం పలు సమస్యలను కలెక్టర్‌కు దృష్టికి ఎంపీటీసీ తీసుకు వెళ్లారు. డొంకరాయి మండల కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.



శంఖవరంలో షష్ఠి ఉత్సవానికి శ్రీకారం చుడుతున్న దృశ్యం

షష్ఠి ఉత్సవానికి రాట ఉత్సవం

శంఖవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వల్లీదేవసేనుడి కల్యాణానికి శనివారం పందిరిరాట వేసి శ్రీకారం చుట్టారు. ఈనెల 26వ తేదీన జరిగే షష్ఠి ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పందిరిరాట వేశారు. ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఏలేశ్వరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయ్యప్ప స్వామి పడిపూజను కన్నుల పండుగా నిర్వహించారు. స్థానిక షిర్డీనగర్‌లో గుర్రం లోవరాజు మహాగంగ దంపతుల సహకారంతో గురుస్వాములు వి.శ్రీను, జింకల సత్తిబాబు, దండు స్వామి, కందుల ప్రభాకర్ ఆధ్వర్యంలో గణపతి, అయ్యప్పస్వామి, కుమార స్వామి చిత్రపటాలను ఏర్పాటుచేసి లక్షబిల్వార్చన, పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పిన్నం శివరామకృష్ణ, ముద్రగడ వీరేంద్ర, యల్లమరాజు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రాచపల్లి అడ్డురోడ్డు వద్ద మామిడితోటలో నిర్వహించిన కార్తీక వన సమారాధన దృశ్యం

కార్తీక వన సమారాధనలు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా శనివారం మండలంలో కార్తీక వన సమారాధనలు, కార్తీక నగర సంకీర్తనలు నిర్వహించారు. రాచపల్లి అడ్డురోడ్డు వద్ద మామిడితోటలో ధర్మవరం నగర సంకీర్తన కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు. ధ్యాన మండలి అధ్యక్షుడు దొడ్డిపట్ల సోమన్నదొర కార్తీక వన సమారాధన ఆవశ్యకత వివరించారు. కార్యక్రమంలో సిద్దా అప్పలరాజు, తోపాటి బాబ్జీ, పోకనాటి వెంకన్న, కుప్పిన నరసింహమూర్తి, కుప్పిన శ్రీను, నాని, పల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ధర్మవరం, రాచపల్లి, ఏలూరు గ్రామాల్లో గోమాతలను ఊరేగించి నగర సంకీర్తనలు నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో కార్తీక బహుళ తదియను పురస్కరించుకుని నవగ్రహ పంచామృత అభిషేకాలు, శాంతి హోమం, అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామికి సామూహిక పంచామృత రుద్రాభిషేకాలు నిర్వహించారు.

అన్నసమారాధన



ఏలేశ్వరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా స్థానిక సాయిబాబా మెట్ట వద్ద కార్తీక వన సమారాధన నిర్వహించారు. శనివారం ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ పిల్ల వీరవెంకట సత్యనారాయణ నేతృత్వంలో వన సమారాధన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ అలమండ చలమయ్య హాజరై ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 3,500 మందికి అన్నదానం చేశారు. పిల్లలకు, పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పేదలకు సీఎం సహాయ నిధి వరం

ఎమ్మెల్యే సత్యప్రభ



పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఒక వరం అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద శనివారం నియోజకవర్గానికి చెందిన పది కుటుంబాలకు సీఎం సహాయ నిధి మంజూరైన రూ.8లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు రకాల అనారోగ్యాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప సంజీవనిలా మారిందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే సత్యప్రభకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, కూటమి నాయకులు యాళ్ల జగదీష్, బద్ది రామారావు, అంబటి రాంబాబు, కత్తిపూడి పీఏసీఎస్ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, నాయకులు కేలంగి జనార్థన్, సాధనాల లక్ష్మీ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో ముగిసిన రిమ్‌జిమ్ వేడుకలు



జ్ఞాపిక అందజేస్తున్న విజయ్‌ప్రకాష్

తుని రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో 5 రోజులుగా నిర్వహిస్తున్న రిమ్‌జిమ్ వేడుక ముగింపు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమం ఘనంగా ముగిసింది. శ్రీప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన తుని, పాయకరావుపేట, అన్నవరం ప్రాంతానికి చెందిన సుమారు 5,500 మంది విద్యార్థులకు సాహిత్యం, సంగీతం తదితర పలు అంశాల మీద జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాల్లో 30 రకాల పోటీలు నిర్వహించి అతిధులకు బహుమతులు అందజేశారు. దీనికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ది హిందు గ్రూప్ ఎస్‌ఎన్‌డి వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ ఆర్నాల, జేఎన్టీయూ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జీవీఎస్ఆర్ దీక్షితులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం అతిధులకు శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ అతిధులను సత్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నతస్థానాలకు తీసుకెళ్లడానికి ఇలాంటి పోటీలు ప్రేరణ కలిగిస్తాయన్నారు.

పారిశ్రామికవేత్త వెంకట కృష్ణారావుకు డాక్టరేట్

కోటనందూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోటనందూరు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత, సంఘ సేవకుడు, టీడీపీ నేత వెలగా వెంకటకృష్ణారావు సేవలను గుర్తించి సౌతాప్రికాకు చెందిన ఎపిక్రెజోప్రొఫెటిక్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను విశాఖలోని యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.జాన్, ప్రొఫెసర్ ఇందిరా చేతులమీదుగా శనివారం ప్రదానం చేశారు. ఆయనకు పదవి రావడంపట్ల మండలంలోని టీడీపీ నేతలు గాడి రాజుబాబు, అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర సత్యానారాయణ, డి.చిరంజీవిరాజు,పోతల సూరిబాబు, లగుడు సత్యనారాయణమూర్తి, చింతకాయల రవికుమార్ , మాతిరెడ్డిభాస్కర్‌రావు, రుత్తల శ్రీనివాస్ తదితరులు అబినందించారు.



డాక్టరేట్ అందుకుంటున్న సంఘ సేవకుడు వెలగా వెంకట కృష్ణారావు

పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు

రౌతులపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి పలువురు ఫారెస్టు అధికారులే తూట్లు పొడుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. రౌతులపూడి శనివారం ఫారెస్టు కార్యాలయంలో గల చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ కార్యాలయంలో చాలా కాలంగా ప్రజలకు గానుగుచెట్టు నీడనిస్తున్నది. వేసవి లో ఈ చెట్టు నీడకింద అనేక మంది కూర్చుని సేదతీరేవారు. అలాంటి ఈ చెట్టు వాలిపోయి ప్రమాదంగా ఉందన్న కారణం చూపి పచ్చని భారీ చెట్టును నరికివేశారని పలువురు వ్యాఖ్యా నిస్తున్నారు. గానుగుచెట్టు కొమ్మలు కొట్టకుండా చెట్టును నరకడంపై ఫారెస్టు అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మొంథా తుఫాను సమయంలో భారీ గాలులు వీస్తాయనే నెపంతో నరికివేసినా అర్థం ఉండేదని పలువురు వ్యాఖ్యానించారు. పర్యావరణ పరిరక్షణ ఇలాగేనా అంటూ అటవీశాఖ ఉద్యోగుల తీరుపై స్థానికులు విమర్శలు గుప్పించారు.



నరికివేసిన చెట్టును తరలిస్తున్న దృశ్యం

హైవేపై వెలగని విద్యుత్ లైట్లు

గండేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మురారి నుంచి నీలాద్రిరావుపేట గ్రామం వరకు సుమారు 19 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి 16 ఉంది. ఆయా గ్రామాల్లో రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు వెలగక హైవే పక్కనున్న గ్రామాలు అంధకారంగా మారుతున్నాయి. మల్లేపల్లి గ్రామంలో సంతమార్కెట్ వద్ద డివైడర్ వద్ద విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో రాత్రి ఆప్రాంతం చీకటిగా మారింది. ట్రాఫిక్ సిగ్నల్ బోర్డు ఏర్పాటు చేయలేదని దీంతో ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్తులు భయపడుతున్నారు. రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మల్లేపల్లిలో హైవే విద్యుత్ లైట్లు వెలగక చీకటిగా మారిన జాతీయ రహదారి

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల

తుని రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టసభలు, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. తునికి చెందిన విద్యార్థిని బోడపాటి రమ్య ప్రియను ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో తుని నుంచి రమ్యప్రియ ప్రతిభ చాటి చట్టసభలను పరిశీలించేందుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపికైన విద్యార్థితోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, విద్యార్థిని తల్లిదండ్రులు తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ తుని మండల అధ్యక్షులు చింతమనీడి అబ్బాయి, ఎ.వెంకటరమణ, తమరాన సత్యనారాయణ, జక్కాన రామునాయుడు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని ప్రతిపాడు సీఐ బి.సూర్య అప్పారావు కోరారు. శనివారం రాత్రి స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్లో హైవేపై ఆయన తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంతం, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రాజగోపాలస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో శనివారం రాత్రి కార్తీకదీపంతోపాటు వివిధ రకాల ఆకృతులతో నిర్వహించిన లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంగర లక్ష్మీ నరసింహాచార్యులు నేతృత్వంలో వేదపండితులు రుక్మిణి, సత్యభామలకు ప్రత్యేక పూజలు చేశారు. దీపోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



కోటనందూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోటనందూరు గ్రామానికి చెందిన ఉత్సవాయి వెంకటపతిరాజు(52) కనిపించకపోవడంతోకేసు నమోదు చేసామని ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన భూపతిరాజు రవివర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమ బావమరిది వెంకటపతిరాజు మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పిఠాపురంలోని ఆశ్రమంలో ఉండేవారన్నారు. ప్రభుత్వ ఫించన్ కోసం ప్రతి నెల 25, 26 తేదీల్లో అక్కడ నుంచి కోటనందూరు వచ్చి ఫించన్ తీసుకొని ఆశ్రమానికి వెళ్లేవాడన్నారు. ఈనెల 3న ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి రాకపోవడంతో బంధువులు, పరిచయస్తుల ఇళ్లకు వెళ్లి ఆరా తీయగా ఫలితం లేదన్నారు. దీంతో శనివారం కోటనందూరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వైద్య కళాశాలల్లో ప్రైవేటీకరణను విరమించుకోవాలి

రౌతులపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలు ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ ముద్రగడ గిరి అన్నారు. మూలగపూడిలో వైసీపీ మండల అధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ అధ్వర్యంలో ప్రైవేటీకరణ పై కోటి సంతకాల ఉద్యమం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జేమీల్, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మిశివకుమారి, సర్పం శ్రీను, అంకంరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధన

గండేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సుబ్బయమ్మపేటలో శనివారం గ్రామానికి చెందిన భక్తులు పల్లి సుబ్బారావు కుటుంబీకులు ఆర్థిక సహాయంతో వనసమారాధన నిర్వహించారు.

బాధితులకు ఎమ్మెల్యే నెహ్రూ పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులకు రూ.25వేలు అందజేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, నవంబరు8(ఆంధ్రజ్యోతి): సోమవరం గ్రామంలో శనివారం ఉదయం కారు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర గాయాలుపాలైన నలుగురు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేశారు. మోర్తా కొండయ్య మృతిచెందగా ఆ కుటుంబానికి రూ.25వేలు అందించారు. అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కలిసి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అడప భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, జంపన రవి వర్మ, మంచి కంటి శ్రీను, జ్యోతుల కోటేశ్వరరావు, జంపన చిరంజీవి ఉన్నారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను కోరారు. పరామర్శించిన వారిలో మత్స తిరుపతి రాయుడు, ఏనుగుపల్లి శ్రీను,అంకం ఓంకృష్ణ, స్వామి పీఎస్‌పీకే బీజేపీ రాంబాబు,కాయల మణికంఠ, పాలెం బాబీ తదితరులు ఉన్నారు.

విప్లవ అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయండి

గండేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఈనెల11న జరిగే విప్లవ వీరుల అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కె.గోపాలపురంలో ప్రదర్శన నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ మల్లిశాల, కె.గోపాలపురం మధ్యలోని ప్రభుత్వ పోరంబోకు అడ్డుకొండ(585 ఎకరాల) భూమిని నిరుపేదలకు పంచిపెట్టాలని పోరాటం సాగిస్తూనే, ఆ భూమిని పేదలకు దక్కకుండా ప్రభుత్వాలు అడ్డుకుంటున్నాయన్నారు.

కార్యదర్శులకు పదోన్నతులు

గండేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న కె.చంద్రశేఖర్, ఎన్టీరాజాపురం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పి.వెంకటరామనాథ్‌కు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందినట్లు ఎంపీడీవో కె.హరికృష్ణసత్యరెడ్డి తెలిపారు. వెంకటరామనాథ్ ద్వారకా తిరుమల, కె.చంద్రశేఖర్ మారేడుమిల్లికి డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీపై వెళ్తున్నారని తెలిపారు.

రూ.25వేలు సాయం

గండేపల్లి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మోర్తా కొండబాబు మృతదేహన్ని జడ్.రాగంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కొండబాబు తల్లిదండ్రులు పద్మరాజు, లక్ష్మి, భార్య చిన్నారి, ముగ్గురు పిల్లలు ఆసుపత్రి వద్ద రోదించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆసుపత్రికి వచ్చి కుటుంబీకులను పరామర్శించి తక్షణసాయం కింద రూ.25వేలు అందించారు

కరాటే మాస్టర్‌కు డాక్టరేట్

జగ్గంపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటకు చెందిన కరాటే మాస్టర్, డిఫిట్నెస్ జిమ్ అధినేత తాండ్రోతు వీర వెంకటరమణకు విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 1986నుంచి కరాటే మాస్టర్‌గా గవర్నమెంట్ హైస్కూల్ నుంచి అన్ని స్కూళ్లలో నేర్పిస్తూ జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో కరాటే పోటీల్లో స్టూడెంట్స్ మెడల్స్ సాధించే విధంగా ట్రైనింగ్ ఇస్తున్నారు. పంపిస్తున్నారు. ఎంత మంది వచ్చినా ఉచితంగా శిక్షణ ఇస్తానని వీర వెంకటరమణ తెలిపారు.